ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 | సంచిక : 03 | నవంబర్ 2009

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ............ 13-09-09
హైదరాబాద్ ........ 23-09-09
జిన్నూరు ............ 19-10-09

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-09-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ ప్రవచనాలు ఏదో కాలక్షేపం కోసం మేము చెప్పటంలేదు. మీరు అందరూ తరించాలి, మీరు ఆత్మసుఖాన్ని పొందాలి, ఆత్మసుఖం మీకు అనుభవంలోనికి వచ్చేవరకూ పునర్జన్మలు తప్పవు. ఆచార్యులవారు వివేక చూడామణిలో జ్ఞానిగురించి చెపుతూ ఏమన్నారు అంటే ఇంద్రియాల తోటి, మనస్సుతోటి, దేహంతోటి, ప్రపంచంతోటి సంబంధం లేకుండా వాడు ఆత్మసుఖాన్ని పొందుతూ ఉంటాడు, వాడి వెనకాల జనం లేకపోయినా, వాడు ఒక్కడే ఉన్నా, వాడు ఎక్కడ ఉన్నా కూడా మహాబలవంతుడుగా ఉంటాడు. మనం ఆ స్థితిని పొందాలి. ప్రతీవాడికి ఎవడి దేహం అంటే వాడికి ఇష్టం. మీ తల్లితండ్రులు మిమ్మల్ని ప్రేమిస్తున్నారు, మీరు మీ తల్లితండ్రులను ప్రేమిస్తున్నారు, ఈ ప్రేమలు నిజంకాదు. మీరు ఏదో బాగా చూస్తారని వారు, వారు ఏదో బంగారం, డబ్బు పడేస్తారు అని మీరు ఇలా స్వార్థంతో ఇవి అన్నీ చేస్తున్నారు. లోకం అంటే ఇలాగే ఉంటుంది. నేను ఉన్నాను అని బైబిలులో చెప్పాడు, దానిని మనం అందుకోవాలి. నేను ఉన్నాను అని మనం అనుకొంటున్నాము కదా. నువ్వు నిజంగా ఉంటే మరి దేహం పోయినప్పుడు నేను పోతున్నాను అని ఎందుకు అనుకొంటున్నావు. ఆ ఉండేది దేహము పోయినప్పుడు అది పోదు. అయితే ఇప్పుడు నీకు ఈ దేహం, ఇంద్రియాలు, మనస్సు అనుభవంలో ఉన్నాయి కాని ఆ వస్తువు నీకు అనుభవంలో లేదు. అది ఎప్పుడూ ఉంటుంది. అక్కడిదాకా ఎందుకు, ఇప్పుడు మనకు గాఢనిద్రలో దేహం గొడవ లేదు, మనస్సు గొడవ లేదు, దేవుడి గొడవ లేదు, పూజలు జపాలు మంచి చెడ్డ ఈ గొడవ ఏమీ లేదు కాని మనం ఉన్నాము కదా,

ఆనందంగా ఉన్నాముకదా. ఆ స్థితిని మీరు పొందాలి, అదీ సాధన యొక్క గమ్యం.

మమకారం విడిచిపెట్టేయండి, మమకారం విడిచిపెట్టేయండి అని లోకంలో చాలామంది చెపుతూ ఉంటారు కాని మహాత్ములపట్ల, మహర్షులపట్ల, సజ్జనులపట్ల మమకారం విడిచిపెట్టవద్దు అని భాగవతంలో చెప్పాడు. మహాత్ములపట్ల, మహర్షులపట్ల మమకారం విడిచిపెట్టేస్తే మీరు నష్టపోతారు. వారితో మమకారం పెట్టుకోవటం వలన వారికి ఏమీలాభం లేదు కాని మనకు ఎలా లాభం అంటే మల్లెపువ్వుల చెట్టు దగ్గర కూర్చుంటే మనకు మల్లెపూవులు వాసన వస్తూ ఉంటుంది అలాగే మహాత్ముల సమక్షంలో వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేయటం వలన మహాత్ముల హృదయంలో ఏదైతే ఉందో, అదే మన హృదయంలో కూడా ఉంది, వారి హృదయంలో ఉన్న వస్తువు వారికి తెలుస్తోంది కాని మన హృదయంలో ఉన్నది మనకు తెలియటం లేదు, దానిని మనం తెలుసుకోవాలి అనే బుద్ధి మహాత్ముల సమక్షంలో మనకు కలుగుతుంది అని భాగవతంలో ఉంది. ఏదో ఒక దీపం వెలుగుతూ ఉంటే దానిని బట్టి మీ దీపాలు కూడా వెలిగించుకోవచ్చు, అసలు దీపం లేకపోతే మనం ఎలా వెలిగించుకొంటాము. మహాత్ములతో సహవాసం వలన మీ సాధనతో సంబంధం లేకుండా మీకు సుఖం, శాంతి వస్తాయి. కొంతమందికి ఎక్కువ స్వార్థం ఉంటుంది, క్రూరత్వం ఉంటుంది, అటువంటి వారితో సహవాసం వలన పరిణామంలో దుఃఖం, అశాంతి వస్తాయి. అందుచేత మహాత్ములతో, సజ్జనులతో సహవాసం విడిచిపెట్టవద్దు, అవసరమైతే వారితో మమకారం పెంచుకో, దానివలన నువ్వు పవిత్రుడవు అవుతావు, నీలో జ్ఞాననేత్రం తెరువబడుతుంది.

ఊరక ఉండటం భగవాన్‌కు ఇష్టం. భగవాన్ ఆయన జీవితంలో ఏ విషయం గురించీ అది మంచి అయినా, చెడ్డ అయినా సరే దేనికీ ఆయన ఆశ్చర్యపడలేదు. ఆయన ఉద్దేశ్యం ఏమిటి అంటే ఈ దేహం ప్రారబ్దం అనుభవించటానికి వచ్చింది. పుణ్య ప్రారబ్దం ఉంటే రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి, పాపప్రారబ్దం ఉంటే దుఃఖం వస్తుంది అంటే పుణ్యం సుఖరూపంలో ఖర్చు అయిపోతుంది, పాపం దుఃఖరూపంలో ఖర్చుఅయిపోతుంది, దానిని నువ్వు ఆపుచెయ్యి లేవు. ఏ ప్రారబ్దం అనుభవించటానికి ఆ శరీరం భూమి మీదకు వచ్చిందో అది పూర్తి అయిన వెంటనే ఆ శరీరం చనిపోతుంది. ఈ లోపులో మనం ఆశ్చర్యపడటం ఎందుకు? అయ్యో అది అలా జరిగింది, ఇది ఇలా జరిగింది అని అనుకోవటం నోరు నొప్పి అని చెప్పారు. ప్రారబ్దాన్ని బట్టి శరీరం అలా ఆడుతుంది, చనిపోతుంది అంతే అన్నారు. మనం ఎంత కంగారుపడ్డా ఆ దేహం ద్వారా జరుగవలసి ఉంటే దానిని మనం ఆపుచేయలేము. జరుగరానిది ఉంటే

దానికోసం మనం ఎంత కష్టపడి పనిచేసినా అది జరుగదు. ఈలోపుగా మనం తలకాయపోటు తెచ్చుకోవటం వలన, కంగారుపడటం వలన ఏమీ ప్రయోజనం లేదు. జరుగవలసింది జరిగే తీరును, జరుగరానిది ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. అందుచేత ఊరక ఉండటం ఉత్తమం అన్నారు భగవాన్. భగవాన్ చెప్పిన దానికి ఇక్కడ ఒక ఉదాహరణ చెపుతాను. రావణాసురుడి క్షేమం కోరి, రావణాసురుడిని బతికించడానికి చాలామంది ప్రయత్నం చేసారు. మాయలేడి వేషం వేయమని మారీచుడి దగ్గరకు వెళ్ళినప్పడు మారీచుడు రావణాసురుడితో చెపుతాడు. సీతమ్మను తీసుకొని వెళ్ళటానికి నా దగ్గరకు వచ్చావు, నువ్వు పొరపాటు చేస్తున్నావు. రాముడు మానవమాత్రుడు అనుకొంటున్నావు, భగవంతుడే ఆ రూపంలో వచ్చాడని నీకు తెలియటంలేదు. నువ్వు రాజువు, నీ క్షేమం మేము కోరాలి. సీతమ్మను తీసుకొనివెళ్ళటం వలన నీవు సుఖపడవు. నువ్వు పాడవటం కాదు లంక అంతా కూడా పాడైపోతుంది, సీతమ్మ గొడవ నీకు వద్దు అని మంచిమాటలు చెపుతాడు. అప్పడు రావణాసురుడు వెళ్ళిపోతాడు. మనం ఒకరి దగ్గర పనిచేసేటప్పడు ఎప్పడూ వారి క్షేమం మనం కోరాలి, ఎవరితోటి అయినా స్నేహాలు చేసినప్పడు కూడా వారి క్షేమం మనం కోరాలి లేకపోతే అది స్నేహం ఎలా అవుతుంది, అది స్నేహం అవ్వదు, ద్రోహం అవుతుంది. సీతమ్మ నీ కోటలో ఉండాలి అని సూర్పణక రావణాసురుడిని రెచ్చగొడుతుంది. మరల రావణాసురుడు మారీచుడి దగ్గరకు వస్తాడు. అప్పడు కూడా మారీచుడు మంచి మాటలు చెపుతాడు. రావణాసురుడు మొదట వచ్చినప్పడు సత్వగుణంలో ఉన్నాడు అప్పడు మారీచుడి మాటలు విని వెళ్ళిపోయాడు. ఇప్పడు తమోగుణంతో వచ్చాడు. మాయ లేడి వేషం వేయకపోతే ఊరుకొనేలాగ లేడు. అప్పడు మారీచుడు తెలివితేటలు ఉపయోగించాడు. మాయలేడి వేషం వేసి వెళితే రాముడు చంపేస్తాడు, అలా వెళ్ళకపోతే రావణాసురుడు చంపేస్తాడు. ఒక దుర్మార్గుడి చేతిలో చనిపోవటం కంటే ఒక మహాత్ముడి చేతిలో చనిపోవటం మంచిది అని మాయలేడి వేషం ధరించి వెళ్ళాడు. ఎక్కడో రావణాసురుడి వరకు అక్కరలేదు, మనం అయినా అంతే. సత్వగుణంలో ఉన్నప్పడు చెపితే వింటాము అదే తమోగుణంలో ఉండగా చెపితే ఎంత మంచి చెప్పినా అది మీ బుర్రకు ఎక్కదు. రావణాసురుడికి విభీషణుడు కూడా చాలా మంచి విషయాలు చెపుతాడు కాని వాడు వినలేదు. విధి బలీయంగా ఉన్నప్పడు మనం ఎంత మంచి చెప్పినా అది ఫెయిల్ అవుతుంది, రావణాసురుడి జీవితమే కాదు ఎవరి జీవితం అయినా అంతే, రావణాసురుడు ఆ మంచిమాటలను ఎలా వదిలేసాడో అలాగే ప్రతి జీవుడు వదిలేస్తాడు, విధి ఆ మంచి మాటలను అతిక్రమించేలాగ చేస్తుంది.

వారు ఏదో చెడ్డ చేసారు, వీరు ఏదో చెడ్డ చేసారు, మనం మంచివారము అని చాలా మంది అనుకొంటూ ఉంటారు. మనం మానవజన్మలోనికి వచ్చాము. మనం ఇక్కడ చెయ్యవలసిన పనులు, చెయకూడని పనులు అని ఉంటాయి. చెయ్యకూడని పనులు మనం చెయ్యటం ఎంత పొరపాటో చెయ్యవలసిన పనులు చెయ్యకపోవటం కూడా అంతే పొరపాటు. మరణానంతరం జీవుడు నేను ఈ పొరపాటు చెయ్యలేదు, ఆ పొరపాటు చెయ్యలేదు అని యమధర్మరాజు దగ్గర అంటే ఆయన ఏమంటాడు అంటే సరే నువ్వు చేయకూడని పనులు చెయ్యలేదు, మరి చెయ్యవలసిన పనులు ఏమైనా చేసావా అని అడుగుతాడు అప్పడు ఈ జీవుడు నోరు వదిలేస్తాడు, వాడు ఏమైనా చేసి ఉంటే కదా చెప్పటానికి. నువ్వు చెయ్యవలసింది చేయాలి తరువాత జరుగవలసింది ఏదో జరుగుతుంది, అది ఈశ్వర నిర్ణయం. పరమాత్మ రాయబారానికి వెళ్లినప్పడు కూడా కౌరవులు తమోగుణంలో ఉన్నారు, వారు నీ మాట వినరు, అందుచేత రాయబారానికి వెళ్లటం అనవసరం అని చెపుతారు. అప్పడు పరమాత్మ ఏమని చెప్పాడు అంటే వారు వినరు అన్న సంగతి నాకు తెలుసు అయినా నా డ్యూటీ నేను చెయ్యటానికి వెళుతున్నాను అని చెప్పాడు. అలాగే మనం కూడా మన డ్యూటీ మనం చెయ్యాలి. నువ్వు దీపాన్ని చూడటానికి ఇంకో దీపం తీసుకొని వెళ్లటం ఎందుకు అంటున్నారు భగవాన్. వస్తువు నీ లోపలే ఉంది, అది తనంతట తానుగా ప్రకాశిస్తోంది. దానిని తెలుసుకోవటానికి నువ్వు మనస్సును కాపాడుకోనక్కరలేదు, ఎప్పడైతే మనోనాశనం అయ్యిందో అప్పడు అది నీకు వ్యక్తమవుతుంది అంతేగాని దానిని తెలుసుకోవటానికి బయట సహాయం ఏమీ అక్కరలేదు. బాహ్యమైన సాధనలు ఇవన్నీ ఎందుకంటే నీకు దేహబుద్ధి తగ్గించటానికే. నీ దేహాన్ని ప్రారబ్దానికి వదిలేసి నీ పని ఏదో నువ్వు శ్రద్ధగా చేసుకొంటూ ఉంటే దేహబుద్ధి సహజంగానే పోతుంది. నువ్వు సంకల్పాలను విడిచిపెట్టు, నీ సంకల్పాలతోను, ఆలోచనలతోను సంబంధం లేకుండా జరగవలసింది జరుగుతూ ఉంటుంది. మనకు తలంపు లేకుండా, కోరిక లేకుండా ఆ పని అవ్వదేమో అని మనం అనుకొంటాము ఇక్కడే మనం ఫెయిల్ అవుతున్నాము. నీ తలంపుతో సంబంధం లేకుండా, కోరికతో సంబంధం లేకుండా మీ దేహం ఏ పని మీద అయితే వచ్చిందో దేహం ద్వారా ఆపని జరిగిపోతూ ఉంటుంది, మీ ప్రయత్నం ఏమీ లేకుండానే అది జరిగిపోతుంది.

మీ హృదయంలోనే శాంతి ఉంది, సుఖం ఉంది, ఆనందం ఉంది. నీ హృదయంలో ఉన్న శాంతి, సుఖం నీకు దొరుకుతూ ఉంటే ఇంక ఆనందంకోసం బయట తిరగవలసిన పని లేదు. నీ హృదయంలో ఉన్న శాంతిలో స్థిరపడిపోతే ఇంక నీ మనస్సు బయట గొడవలలోనికి

వెళ్లదు. నీ డ్యూటీ ఏదో నువ్వు చేస్తావు కాని ఆనందం కోసం పని చెయ్యవలసిన అవసరం లేదు. ఏదో వస్తుందని ఆశించిమటుకు పనిచెయ్యవు. నన్ను బ్రహ్మచర్యం అవలంభించ మంటారా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. దానికి భగవాన్ ఏమన్నారు అంటే బ్రహ్మచర్యం అంటే బ్రహ్మంలో చరించటం, బ్రహ్మంలో నిలబడి ఉండటం, బ్రహ్మంలో చరించేవాడే బ్రహ్మచారి అని చెప్పారు. భగవాన్ మరణానుభవం ద్వారా బ్రాహ్మీస్థితిని పొందారు. మరణానుభవంలో మూడు దేహాలూ కాలిపోయినాయి. అంటే స్థూలదేహం, సూక్ష్మదేహం, కారణదేహం మూడూ కాలిపోయినాయి. స్థూలదేహం అంటే మాంసం, ఎముకలు, రక్తం. సూక్ష్మదేహం అంటే మనస్సు. కారణదేహం అంటే అజ్ఞానం. ఈ మూడు పోకుండా ఏ మనిషికి జ్ఞానం కలుగదు. ఈ అశాంతి ఎప్పడు పోతుంది, ఈ దుఃఖం ఎప్పడు పోతుంది అనుకొనేవాడు అజ్ఞాని. ఏది వచ్చినా మనోదేహములకే కదా, ఈ గొడవలన్నింటికి దేహము, మనస్సే కారణం. గాఢనిద్రలో ఉన్నప్పడు మనకు ఏ గొడవ లేదు. గాఢనిద్రలో మనకు దేహం గొడవ, మనస్సు గొడవ, లోకం గొడవ ఏ గొడవ లేదు. అందుచేత అక్కడ సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము. మీది ఏ ఊరు అంటే పాలకొల్లు అంటారు. పాలకొల్లుకి మీకు సంబంధం ఏమిటి? నీ దేహం ఎక్కడ పుడితే అది మీ ఊరు అనుకొంటున్నారు, అసలు దేహము నువ్వా? ఇక్కడే ప్రతివాడిని మాయ కమ్మేస్తోంది. మాయ అంతా తీసుకొని వచ్చి దేహము నేను అనే చిన్నతలంపులో పెట్టేసాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ దేహాభిమానం గురించి ఒక ఉదాహరణ చెప్పాడు. ఒకడు బిందె తీసుకొని నదికి వెళ్లి నీరు తెచ్చుకొన్నాడు. ఆ నీరు నదిలోనివే కాని ఇంటికి తెచ్చుకొని ఆ నీళ్ళు నావి అంటున్నాడు. నదిలో నీరు ఉన్నప్పడు వాటితో తాదాత్మ్యం లేదు, ఆ నీరు ఇంటికి తెచ్చుకొన్నాక వాటితోటి తాదాత్మ్యం వచ్చేసింది. అలా తాదాత్మ్యం వచ్చినప్పడు కూడా ఆ నీరు నదివే. ఎంతమాయ అంటే నదిలో నీరు ఎలాపోయినా వాడికి అక్కరలేదు కాని వాడి బిందెలో నీరు మటుకు పోకూడదు. తాదాత్మ్యం వచ్చినప్పడు ఉన్నాయని, ఖర్చు అయిపోయినాయి అనిలెక్క వచ్చేస్తుంది. మనోదేహములతో తాదాత్మ్యం కూడా అటువంటిదే. ఈ మనస్సులు అన్నీ భగవంతుడిలో నుండే, హృదయంలోనుండే వచ్చినాయి. మీ మనస్సు వెళ్లి హృదయంలో పడిపోయింది అనుకోండి, నా మనస్సు వెళ్లి హృదయంలో పడిపోయింది అనుకోండి అక్కడ రెండుగా లేము, ఉన్నది ఒక్కటే.

అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు. జీవుడు కూడా అక్కడ నుండే వస్తున్నాడు. అక్కడే వాసనలు కూడా ఉన్నాయి. వాసనలో నుండి తలంపు వస్తుంది. తలంపును బట్టి మాట్లాడతారు, తలంపును బట్టి పని చేస్తారు. ఈ జీవుడు ఎక్కడ

నుండి అయితే వచ్చాడో తిరిగి అక్కడకు జీవుడిని పంపటమే సాధన యొక్క గమ్యం. నువ్వు పొందవలసిన అనుభవాలు పొందేవరకూ ఒకోవాసన, ఒకోవాసన విడిచిపెడుతూ ఉంటాడు. మనలో ఏ వాసన ఉందో మనకు తెలియదు. ఈశ్వరుడు ఆ వాసనను విడిచిపెట్టినప్పడు ఆ వాసన మనకు తలంపు రూపంలో వస్తుంది. ఆ వాసన ఉందని అప్పడు మనకు తెలుస్తుంది. నువ్వు అంతర్‌దృష్టిని అలవర్చుకొని హృదయంలోనికి వెళ్ళిపోతే నీ శరీరగతమైన యాత్ర ఆగిపోతుంది. అంటే జీవుడిని వాడి మూలమైన హృదయంలోనికి పంపాలి. ఆంజనేయస్వామి మాట్లాడుతూ ఉంటే భగవంతుడు ఆశ్చర్యపోయాడు. లోపల జీవుడు పరిశుద్ధుడు అయిపోయాడు అనుకోండి, పాపరహితుడు అయిపోయాడు అనుకోండి మీ చేతితో చేసేపని, మాట్లాడేమాట చాలా మృదువుగా ఉంటుంది, సౌందర్యంగా ఉంటుంది, దానిని మనం వర్ణించలేము. ఇతరులు చేసే పని నువ్వు కూడా చేయవచ్చు కాని ఆ పని వెనకాల శాంతి ఉంటుంది, ఆనందం ఉంటుంది. అది ఇతరులకు శాంతిని కలుగజేస్తుంది. ఓ హనుమంతా! నువ్వు పాపరహితుడవు, నీ అంతఃకరణం ఎంత పరిశుద్ధంగా ఉంది, పరిశుద్ధమైన అంతఃకరణానికి, నిశ్చలమైన అంతఃకరణానికి ఆత్మసుఖం అందకుండా ఎలా ఉంటుంది అంటాడు పరమాత్మ. కొంతమంది మనతో మాట్లాడుతూ ఉంటే కళ్ళు, చేతులు తిప్పేస్తారు, కళ్ళనుండి ద్వేషం కక్కుతూ ఉంటారు. కొంతమంది ఇంటిలో దారిద్ర్యంగా ఉన్నా మనస్సులో మటుకు సంపన్నంగానే ఉంటారు. ఇంట్లో పేదరికం ఉన్నా, మనస్సులో ఎందుకు పేదరికంగా ఉండాలి అంటారు. నీ మనస్సులో దారిద్ర్యం లేకపోతే, నువ్వు మనస్సులో సంపన్నంగా ఉంటే నువ్వు భౌతికంగా ఇతరులకు ఏమి చేయలేకపోయినా, ఎప్పడూ వారిక్షేమం కోరుతూనే ఉంటావు.

మనస్సును హృదయంలోనికి పంపటానికే సాధనలు అన్నీ. మనస్సును హృదయంలోనికి పంపితే, మనస్సు తన మూలమైన హృదయంలో నిలబడితే అది కరిగిపోతుంది. మనస్సు హృదయంలోనికి జారుకుంటేనేగాని అసలు మనకు నిద్రపట్టదు. గాఢనిద్రలో మన మనస్సు సహజంగానే హృదయంలో ఉంటుంది. అక్కడ మన ప్రయత్నం ఏమీ లేదు. అలాగే మన ప్రయత్నంతో సంబంధం లేకుండా జాగ్రదవస్థలో మన మనస్సు హృదయంలో ఉంటే అప్పడు మనో నాశనం అవుతుంది, అక్కడ ఉన్న పరమాత్మ నీకు వ్యక్తమవుతాడు, మీరు ప్రాణాయామం చేయండి, మహాత్ములతో సహవాసం చేయండి, నిష్కామకర్మ చేయండి, ఈశ్వరుడిపట్ల భక్తి కలిగి ఉండండి, వీటిద్వారా మనస్సు యొక్క చాపల్యం ఎప్పడైతే తగ్గిపోయిందో అప్పడు మనస్సులో ఉన్న వాసనలు కూడా క్షయించటం ప్రారంభమవుతాయి. ఒక్క వాసన మిగిలి ఉన్నా అది పునర్జన్మలను తీసుకొని వచ్చేస్తుంది. మనస్సు శిరస్సులో ఉన్నప్పడు అది విజృంభిస్తూ

ఉంటుంది, హృదయంలోనికి వెళ్ళినప్పుడు అది కృశిస్తుంది. గాఢనిద్రలో మనస్సు హృదయంలో ఉండటానికి ఏమీ ప్రయత్నం అక్కరలేదు. జాగ్రదవస్థలో మనస్సును హృదయంలో ఉంచటానికి ప్రయత్నం అవసరం. మనం ప్రయత్నం చేస్తూ ఉంటే అది హృదయంలోనికి వెళుతూ ఉంటుంది, బయటకు వస్తూ ఉంటుంది. మనం ప్రయత్నం ఎంతవరకు చేయాలి అంటే మన ప్రయత్నంతో సంబంధం లేకుండా అది హృదయంలో స్థిరంగా ఉండేవరకూ మనం ప్రయత్నం చేయాలి. అప్పటివరకు మనం సాధన చేయవలసిందే. ఎవరైనా ఆపరేషన్ చేయించుకొంటున్నారు అనుకోండి ఆపరేషన్‌కు సంబంధించి అంతా ప్రిపేర్ చేసి చేయించుకొనే వ్యక్తిని ఆపరేషన్ రూము దగ్గరకు తీసుకొనివెళ్ళి లోపలకు గెంటేస్తారు. తరువాత అక్కడ ఉన్న డాక్టర్ ఆయన చేయవలసిన పని చేస్తాడు. బయట గురువు చేసే సహాయం ఏమిటి అంటే నీ మనస్సును లోపలకు గెంటుతాడు. నిజమైన గురువు లోపలే ఉన్నాడు. నీ మనస్సు లోపలకు వెళ్ళాక ఆయన చేయవలసిన సర్జరీ అంతా ఆయన చేస్తాడు. సర్జరీ చేయాలంటే అసలు ఈ పేషంట్ డాక్టరుగారి చేతికి అందాలికదా. ఆ పేషంట్ డాక్టరుగారికి అందకుండా పారిపోతే ఆయన ఏమి చేయగలడు. అంటే బయట గురువు చేసేపని ఏమిటి అంటే నీ మనస్సును ప్రిపేర్ చేసి లోపలకు గెంటి లోపల ఉన్న నిజమైన గురువుకి అందేలా చేస్తాడు, నీ మనస్సు ఎప్పుడైతే ఆయన చేతికి దొరికిందో దానిని లోపలకు లాగేసుకొని ఆ మనస్సును కత్తిరించి ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు, వాడు గురువు. లోపల ఉన్న నిజమైన గురువే నీ కోసం ఒక రూపం ధరించి వస్తాడు. నీతో కలిసి తిరుగుతాడు, నీతో మాట్లాడుతాడు, నీ క్షేమ సమాచారాలు అడుగుతాడు. ఇలా ఏది చేసినా నీ మనస్సును హృదయంలోనికి తీసుకొనిపోవటమే ఆయన గమ్యం, మిగతావి అన్నీ తాత్కాలికం, స్వప్న సమానం. ఈ సృష్టి ఎంతకాలం అయితే ఉందో అంతకాలం జీవకోటి అలా వస్తూ ఉంటారు, పోతూ ఉంటారు. నిన్ను నీవు ఉద్ధరించుకోవటం మానేసి, నిన్ను నీవు బాగుచేసుకోవటం మానేసి ఈ లోకాన్ని ఎలా ఉద్ధరించాలి అని ఆలోచిస్తావు, అదే మాయ. నువ్వు పుట్టకముందు ఈ లోకాన్ని ఎవడైతే చూసాడో, నువ్వు చనిపోయిన తరువాత కూడా వాడే ఈ లోకాన్ని చూసుకొంటాడు. మధ్యలో నువ్వు ఎవడివి ఉద్ధరించడానికి. ఈ లోకానికి ఒక ప్రభువు ఉన్నాడు, అంతా ఆయనే చూసుకొంటాడు. నువ్వు బాగుపడుతున్నావు అనుకో నిన్ను చూసి వాడు బాగుపడ్డాడు మనం కూడా బాగుపడాలి అనే బుద్ధి ఇతరులకు కలుగుతుంది. మీరు సత్కర్మ చేస్తున్నారు అనుకోండి, మీరు ఎవరితోటి సత్కర్మ చేయమని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. మిమ్మల్ని చూసి వారు సత్కర్మ చేస్తున్నారు మనం కూడా చేద్దాము అనే బుద్ధి ఇతరులకు కలుగుతుంది.

మహాత్ములు, సత్పురుషుల పట్ల మమకారం విడిచిపెట్టవద్దు, వారితో తాదాత్మ్యం వదులుకుంటే సడన్‌గా నీకు మంచిబుద్ధి పోతుంది. విశ్వాసపరులకు మరణం ఎక్కడ ఉంది. మీకు గురువు పట్ల సజీవమైన విశ్వాసం ఉంది అనుకోండి, ఈ శరీరం చనిపోయి మీరు ఇంకో శరీరంలో ఉన్నా మీ విశ్వాసమే మిమ్మల్ని గురువు దగ్గరకు తీసుకొనిపోతుంది. అందుచేత విశ్వాసపరులకు మరణం లేదు. మీకు భక్తి దీర్ఘంగా ఉండాలి, విశ్వాసం దీర్ఘంగా ఉండాలి, ప్రేమ దీర్ఘంగా ఉండాలి. భక్తిలేనివారు భక్తులను ఎప్పుడు అవమానపరుద్దాము అని కనిపెట్టుకొని ఉంటారు. భక్తి దీర్ఘంగా లేకపోతే వారు అవమానపరచినప్పుడు మీ భక్తి చెదిరిపోతుంది. భక్తి దీర్ఘంగా లేకపోతే బాహ్య సంఘటనలకు చెదిరిపోయి జారిపోతుంది. గురువు అంటే వాడు ఏదో బోధ చెప్పేసి వదిలేయడు. వాడు ఏ స్థితిని పొందాడో ఆ స్థానంలోనికి మిమ్మల్ని తీసుకొని పోయేవరకు ఆయన మిమ్మల్ని విడిచిపెట్టడు. అయితే మీకు దీర్ఘమైన విశ్వాసం ఉండాలి. లోకంలో మీకు ఏమైనా అవమానాలు వచ్చినా కంగారు పడకండి. మిమ్మల్ని అవమానించటానికి మీరు ఎప్పుడు దొరుకుతారా అని కొంతమంది చూస్తూ ఉంటారు, అది దుష్టుల లక్షణం, భక్తిహీనుల లక్షణం. శ్వాసపోయినా విశ్వాసం పోకూడదు అని మన పురాణాలలో చెపుతారు.

ప్రారబ్ధాన్ని బట్టి మీకు సుఖాలు వస్తాయి, దుఃఖాలు వస్తాయి. సుఖం వచ్చినప్పుడు పొంగిపోవద్దు, దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోవద్దు. గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా వాటిని చూసి వికారం తెచ్చుకోవద్దు, మీ మనస్సును సమానంగా ఉంచుకోవటానికి ప్రయత్నం చేయండి. మనకు మంచిరోజులు వచ్చినా, చెడ్డరోజులు వచ్చినా అవి అలాగే ఉంటాయని అనుకోవద్దు. మన శరీరం స్మశానంకు వెళ్ళేలోపు రోజులు ఎన్ని రకాలుగా మారతాయో చెప్పలేము. ఇవన్నీ నిజంకాదు. మీ అదృష్టం మాయ, దురదృష్టం మాయ. సంపద అంతా ఈశ్వరుడిదే. నీ దేహప్రారబ్ధాన్ని బట్టి కొంత నీకు కేటాయిస్తాడు. ఒకోసారి ఇస్తూ ఉంటాడు, ఒకోసారి లాగేసుకొంటాడు, ఇవన్నీ మాయ గొడవలు, వీటిని చూసి వికారం తెచ్చుకోవద్దు. వాటిని చూసి వికారం పొందితే మీ మనస్సు బాహ్యముఖానికి పోతుంది కాని అంతర్ముఖం అవ్వదు. మనస్సు అంతర్ముఖమేతే కాని అది ఆత్మాకారం చెందదు. ఓ అరుణాచలేశ్వరుడా! నేను అహంకారం అనే పిడికిలిలో పడి ఉన్నాను. ఈ పిడికిలిలో నుండి నువ్వు విడిపించకపోతే ఇంక విడిపించటానికి ఎవరికి సాధ్యమవుతుంది. ఈ అహంకారం అనే పిడికిలిలో నుండి నన్ను బయటకు తీసుకొని రా అన్నారు భగవాన్. అంటే కొంతమంది ఈ దేహమే సర్వస్వం అనుకొంటారు, ఆ బుద్ధిని ముందు పోగొట్టు అదీ భగవాన్ చెప్పేది. రాముడు ఒక ఋషి

దగ్గరకు చూడటానికి వెళతాడు. ఆయన స్వయంగా పరమాత్ముడు అయినప్పటికీ సత్పురుషుల పట్ల ఆయనకు ఉన్న గౌరవం చూడండి. ఆ ఋషి ఏమి చెప్పాడు అంటే నా టైము అయిపోయింది, నిన్ను చూడటానికి ఈ శరీరం నిలబడి ఉంది. ఫలానా చోట శబరి ఉంది, నీ కోసం ఎదురు చూస్తోంది, శబరికి దర్శనం ఇవ్వమని చెప్పి ప్రాణం విడిచిపెట్టేసాడు. శబరికి అటువంటి గౌరవం ఎందుకు వచ్చింది అంటే గొప్పదయగల అంతఃకరణం. శబరికి పెళ్లి చేయటానికి ముహూర్తం పెట్టారు. రెండు రోజులకు పెళ్లి అనగా మేకలను, గొర్రెలను తీసుకొని వచ్చి ఇంటి దగ్గర కట్టేసారు. ఎందుకు మేకలను, గొర్రెలను తీసుకొని వచ్చారు అని శబరి అడిగితే నీ పెళ్లి కదా వీటిని చంపి ఆ మాంసం వండిపెడతారు అని చెప్పారు. నా పెళ్లి ఏమిటి? ఆ జంతువులను చంపటం ఏమిటి? అని శబరి అక్కడ నుండి పారిపోయింది, అంత దయగల హృదయం ఆమెది. ఆమె అదృష్టం ఏమిటి అంటే అలా పారిపోయి వెళ్లి మాతంగ మహర్షి చేతిలో పడింది. మాతంగమహర్షి ఆవిడకు మంచి ట్రైనింగు ఇచ్చాడు. మన ప్రారబ్దాన్ని బట్టే బంధువులు, స్నేహితులు దొరుకుతారు. శబరితో మాతంగ మహర్షి ఏమన్నాడు అంటే ఇంతకాలం నాకు సేవ చేసావు, నీలోని ప్రేమను, హృదయంలో ఉన్న దయను సేవరూపంలో చూపించావు, నేను రేపు వెళ్లిపోతున్నాను అని చెప్పాడు. అయితే నన్ను కూడా తీసుకొనిపొండి అని శబరి చెప్పింది. శబరీ నేను ఎక్కడకు వెళ్లిపోతున్నానో చెప్పమంటావా, ఏ ఇద్దరం కలిసి అక్కడకు ప్రయాణం చేయలేము శబరీ అన్నాడు. అక్కడకు ఒంటరిగానే ప్రయాణం చెయ్యాలి. నేను నీకు గురువునేకాని నాకంటే నువ్వే ఎక్కువ అదృష్టవంతురాలవు. భగవంతుడు నీ దగ్గరకు రాముడి రూపంలో వస్తాడు, నువ్వు ఆశ్రమం విడిచిపెట్టకు, ఇక్కడే ఉండు, రాముడు నీ దగ్గరకు వచ్చి నిన్ను తరింపచేస్తాడు, అది నీ అదృష్టం అని చెప్పాడు. ఇక్కడ శిష్యురాలికి ఉన్న వైభవం గురువుకి లేదు, ఎవరి పుణ్యం వారిదే. మనం ఎక్కడో ఒకచోట పుట్టి, ఈ శరీరం ద్వారా సాధన చేసి మనం కొన్ని దుర్వాసనలు పోగొట్టుకోవచ్చు, కాని పుట్టుకతోటే దుర్విషయాలు ఎలా ఉంటాయో నీకు తెలియదు శబరి, ఇంక నీకు సాధన ఏల? నువ్వు రాముడిని చూడటం కాదమ్మా, రాముడిచేత చూడబడతావు శబరీ అని చెప్పాడు. రాముడిచేత చూడబడింది, శబరి పని పూర్తి అయిపోయింది. రాముడు నిర్గుణుడు, సగుణుడు కూడా. పైకి మంచి గుణాలతో మనకు కనిపిస్తాడు, లోపల గుణాలకు అతీతంగా ఉంటాడు. ఎందుకు అలా ఉంటాడు అంటే ఆ మంచి గుణాలను మనకు చూపిస్తూ, గుణాలు లేని చోటుకి మనలను మోసుకొనిపోతాడు, వాడు రాముడు. నాకు రామాయణంలో జటాయువు అంటే బాగా ఇష్టం. ఎందుచేతనంటే ఏమీ స్వార్థం లేకుండా ప్రాణం ఇచ్చేసింది.

రాముడి కార్యంలో జటాయువుకు ఏమీ స్వార్థం లేదు. అందుచేత దశరథుడికి లేని భాగ్యం జటాయువుకు కలిగింది. రాముడు కట్టెలు పేర్చి, జటాయువును ఆ కట్టెల మీద పెట్టి ఆయన చేతులతో నిప్ప పెట్టాడు, ఇంకేం కావాలి, అదీ జటాయువు యొక్క భాగ్యం. మహర్షులు, మహాత్ములు, పెద్ద పెద్ద తపస్సులు చేసినవారు ఏ లోకానికి వెళుతున్నారో ఓ జటాయువు నువ్వు కూడా అక్కడకు వెళ్ళు, ఇది రాముడి ఆజ్ఞ అని చెప్పాడు. ఈ శరీరం చనిపోయిన తరువాత జ్ఞాపకాల గురించి చెపుతున్నాను. నాకు రోజూ చేతికి గడియారం పెట్టుకొనే అలవాటు. కాని ఈ రోజు గడియారం పెట్టుకోవటం మర్చిపోయాను. అయినా గడియారం పెట్టుకొనే అలవాటు ఉంది కదా అందుచేత చేతివంక చూసుకొంటున్నాను. అలాగే మనం ఈ శరీరంలో కొన్ని సంవత్సరాలు ఉంటాము కదా చనిపోయిన తరువాత నా శరీరం ఏది, ఎక్కడికి వెళ్ళిపోయింది అని అలా చూసుకొంటూ ఉంటాము. ఆ శరీరం ఇంకరాదు, ఆ శరీరానికి మనకు ఎట్టి సంబంధం లేదు అని మనస్సులో నిర్ధారణ అయ్యాక ఇంక పాత శరీరం గొడవ వదిలేస్తాము. రాముడు ఏమన్నాడు అంటే హనుమంతా నీవు పాపరహితుడవు, నీ అతఃకరణం ఎంత శుద్ధిగా ఉంది, ఎంత నిర్మలంగా ఉంది, నీ అతఃకరణం అంత నిర్మలంగా ఉన్నప్పడు ఆత్మసుఖం నీకు అందకుండా ఎలా ఉంటుంది. అందుతుంది అని చెప్పటంలేదు, ఆత్మసుఖం నీకు అందకుండా ఎలా ఉంటుంది అంటున్నాడు. ఒకవేళ నాకు ఆత్మసుఖం వద్దు అన్నా వచ్చి నీ మీద పడుతుంది అని చెప్పటం. ఎంత అందంగా చెపుతున్నాడో చూడండి. ఇప్పడు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేను నేను కాదు. దేహంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి సంబంధం లేకుండా స్వతంత్రంగా ఒక నేను మన హృదయంలో ఉంది. అదే నిజమైన నేను. శరీరం చనిపోయినప్పడు ఈ శరీరాన్ని స్మశానానికి తీసుకొనివెళ్ళి కాల్చేస్తారు. ఈ శరీరం పోయినప్పడు నేను పోవాలికదా, మరి శరీరం పోయినప్పడు నేను పోకుండా ఉన్నాను ఏమిటి అంటే చనిపోయేది నేను కాదు, దేనికైతే చావులేదో, ఏదైతే మన హృదయంలో స్వతంత్రంగా ఉందో అదే నేను అని ఆయనకు మరణానుభవంలో స్ఫురించింది. ఇవి వట్టిమాటలు కాదు, ఏదో పుస్తకాలు చదివితే వచ్చేది కాదు, అది ఈశ్వరుని దయ. మరణానుభవం ద్వారా మృత్యువుతో సంబంధం లేని స్థితికి ఎదిగి వెళ్ళాడు. టీచింగ్ ఎలా ఉండాలి అంటే స్కూలులో, కాలేజీలో మాష్టార్లు పాఠాలు చెపుతారు కదా, నువ్వు అలా చెప్పకు, తల్లి తన పిల్లలను దగ్గర కూర్చోబెట్టుకొని, ఎంతో సన్నిహితంగా ఉంటూ ఎలా బోధిస్తుందో నువ్వు సబ్జక్టు చెప్పేటప్పడు అలా చెప్పాలి అని శాస్త్రం చెపుతోంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-2009, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన హృదయంలో ఒక సద్వస్తువు ఉంది. అది తాత్కాలికం కాదు. మన శరీరం తాత్కాలికం. ఇది చనిపోతుంది. కొంతకాలానికి పూర్వం ఈ దేహం లేదు, ఇప్పుడు మన దేహం ఉన్నదాని వలె కనిపిస్తోంది, కొంతకాలం తరువాత ఇది ఉండదు. ఒకకాలం ఈ దేహాన్ని తీసుకొని వచ్చింది. ఏ కాలమైతే ఈ దేహాన్ని తీసుకొని వచ్చిందో మరల ఆ కాలమే ఈ దేహాన్ని తీసుకొని పోతుంది. నేను కాలరూపంలో ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఏ కాలంలో ఏది జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది, దానిని మనం ఆపుచేయలేము. ఏ గంటలో ఏది జరగాలో ఆ గంటలో అది జరుగుతుంది కాని ముందు జరిగిపోతే బాగుండును అని మనం అనుకొన్నా అది జరుగదు. ఒక్కక్షణం కూడా అటు ఇటు జరపటానికి మనకు అవకాశం లేదు. జీవితం అంటే పూలపాన్పుకాదు. మనకు అనేక కష్టాలు రావచ్చు, సంసార జీవితంలో అనేక నష్టాలు రావచ్చు, మనం అనుకోని దురదృష్టకరమైన సంఘటనలు అనేకం మనకు ఎదురుకావచ్చు, ఈరోజు మనకు సంపద, ఆరోగ్యం ఉండవచ్చు, రేపు అనారోగ్యం, దారిద్ర్యం రావచ్చు, భవిష్యత్‌లో ఏమి జరుగుతుందో మనకు తెలియదు. ఏది వస్తుందో రానివ్వండి, ఒకవేళ దానిని మనం ఆపుచేయాలన్నా ఆపుచేయలేము. అందుచేత దానిని ఫేస్ చెయ్యటం నేర్చుకోవాలి. అలా ఫేస్ చెయ్యాలంటే మనకు ఆత్మబలం ఉండాలి. మనకు ఇష్టంలేని సంఘటనలు జీవితంలో అనేకం జరుగుతూ ఉంటాయి, వాటిని పాజిటివ్‌గా తీసుకోవాలి కాని నెగిటివ్‌గా తీసుకోకూడదు.

నేను అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు కదా, అయితే పరమాత్మ నా హృదయంలో కూడా ఉండాలి, అలా ఉంటే ఆయన నాకు కనబడాలి కదా ఎందుకు కనబడటంలేదు అని ఒకరు భగవాన్‌ను అడిగారు. దానికి భగవాన్ ఏమి చెప్పారు అంటే నీ రాంగ్ హేబిట్స్‌లో నుండి, రాంగ్ తింకింగ్‌లో నుండి ముందు బయటకు రా అలా బయటకు వచ్చిన తరువాత కూడా హృదయంలో ఉన్న వస్తువు నీకు గోచరం కాకపోతే అప్పుడు ఈ ప్రశ్న అడుగు అని చెప్పారు. పామరులమాట వదిలేయండి, ఈ పండితులు మేధావులు శాస్త్రాలలో ఆత్మను వెదకటం ప్రారంభించారు. ఆత్మ నీ హృదయంలో ఉంది అని శాస్త్రం చెపుతోంది. ఎక్కడైతే వస్తువు ఉందో అక్కడ వెదకటం మానేసి దానికోసం మనం శాస్త్రాలలో వెదుకుచున్నాము. శాస్త్రాలలో వెదికే కొలదీ పాండిత్యం వస్తుంది, విషయజ్ఞానం వస్తుందికాని ఆత్మజ్ఞానం రాదు, ఆత్మసుఖం నీకు లభ్యంకాదు. మీరు ఏదైనా వ్యాపారం

చేయటానికి ధనం అవసరం కాని జ్ఞానం సంపాదించటానికి ధనం అక్కరలేదు, తెలుసుకోవాలనే కాంక్ష ఉంటే సరిపోతుంది, అది తెలియబడుతుంది. అదే ఏసు చెప్పాడు తట్టండి తెరవబడుతుంది, అడగండి ఇవ్వబడుతుంది అన్నాడు. మనం సిన్సియర్‌గా ప్రయత్నం చేయాలి. మనం ఏ పని చేస్తున్నా, మాట్లాడుతున్నా, మనకు జ్ఞానం కావాలన్నా వీటన్నింటికి భక్తి యొక్క సపోర్టు అవసరం.

మనం చెవులతోటి ఏవైనా ఆధ్యాత్మిక విషయాలు వింటాము అనుకోండి, లేకపోతే కళ్ళతోటి చూస్తాము అనుకోండి, అది సరిపోదు. వాటిని మననం చెయ్యాలి, ఆ మాటలను ధ్యానం చెయ్యాలి. అలా మననం చేయటం వలన, ధ్యానం చేయటం వలన మనస్సు అంతర్ముఖ మవుతుంది. మనస్సు అంతర్ముఖమయ్యి దాని మూలమైన హృదయంలో స్థిరపడినప్పుడు మనస్సు నశిస్తుంది, అక్కడ ఉన్న సత్యవస్తువు మనకు ఎరుకలోనికి వస్తుంది. మననం అంతదూరం తీసుకొని పోతుంది. అందుచేత శ్రవణ మననాలను విడిచిపెట్టవద్దు. జపధ్యానముల వలన నీ హృదయంలో ఉన్న ఆనందం, శాంతి నీకు అందుతూ ఉంటాయి. అప్పుడు లోకంలో ఉన్న భోగాల వైపుకు నీ మనస్సు తిరగదు. దూడకు పచ్చగడ్డి దొరికినప్పుడు దాని ప్రక్కన మీరు వట్టిగడ్డి వేసినా అది తినదు ఎందుచేతనంటే అది పచ్చగడ్డి రుచి చూసింది. అలాగే ఎప్పుడైతే హృదయంలో ఉన్న స్వతంత్రమైన సుఖం, ఆనందం నీ మనస్సుకు అందుతున్నాయో ఇంక అది ఇంద్రియ సుఖాలవైపుకు చూడదు. ఇప్పుడు మనం సినిమాలలో, టీవిలో, స్నేహాలలో, పెళ్ళిళ్ళలో ఆనందం ఉందని వాటి చుట్టూ తిరుగుతున్నాము. లోకంలో ఏ పని చేసినా వాడు ఆనందంకోసమే చేస్తాడు కాని ఆనందం ఎక్కడ ఉందో వాడికి తెలియదు. ఆనందం కోసం బాహ్యంగా ఏదో ప్రయత్నం చేస్తూ ఉంటాడు, మరల భంగపడుతూ ఉంటాడు. రమణాచార్యులు ఏమని చెప్పారు అంటే నాకు ఆనందం కావాలి అని నువ్వు కోరుకోవటంలో తప్పలేదు కాని ఆనందం ఎక్కడ ఉందో నీకు తెలియటంలేదు. ఆనందం బజారులో ఉందని దానికోసం బజారులో వెతుకుతున్నావు. ఆనందం బయట ఎక్కడా లేదు, నీ హృదయంలోనే ఉంది. అక్కడ అన్వేషణ చెయ్యి ఇవాళ కాకపోతే రేపు అయినా అది నీకు దొరుకుతుంది. వివేకంతోటి, వైరాగ్యంతోటి లోపలకు వెళ్ళు. నువ్వు సిన్సియర్‌గా సాధన చెయ్యి. సాధన మొదటలో నీకు చేదుగా ఉండవచ్చు, చేసే కొలది సాధన నీకు చాలా ఉపయోగపడుతుంది. ఎవరితో ఎలా మాట్లాడాలి, ఎవరితో ఎలా ప్రవర్తించాలి ఈ విషయాలు అన్ని తెలుసుకోవటానికి వివేకం ఉండాలి. భవిష్యత్‌లో డబ్బులేనివాడు, చదువులేనివాడు సుఖంగా బతకవచ్చు కాని వివేకం లేనివాడు ఈ లోకంలో సుఖంగా బతకలేడు. మీకు వందకోట్ల డబ్బు ఉంటే, మీకు

తెలివితేటలు లేకపోతే ఈ లోకం మిమ్మల్ని సుఖంగా బతకనివ్వదు, అది లోకం యొక్క పోకడ. మీకు బుద్ధి సూక్ష్మతలేకపోతే లోకం మిమ్మల్ని మోసం చేస్తుంది. మీరు పిల్లలకోసం డబ్బు సంపాదిస్తున్నారు, వారిని డబ్బు ఖర్చుపెట్టి బాగా చదివిస్తున్నారు, సంతోషమే కాని ఏది వారికి ఉపయోగపడుతుంది, ఏది ఉపయోగపడదు అని ఆ బుద్ధి సూక్ష్మత వారిలో అభివృద్ధి అయ్యేలా చూడాలి. బుద్ధిసూక్ష్మత వారిచేత కల్టివేట్ చేయించలేకపోతే మీరు ఎంత డబ్బు ఇచ్చినా, వారు ఎన్ని డిగ్రీలు సంపాదించినా ఏమీ ప్రయోజనం ఉండదు, వారు సుఖంగా బతకలేరు.

మనకు హోలీ కంపెనీ చాలా ముఖ్యం. హోలీ కంపెనీ వలన లాభం ఏమిటి అంటే వారి హృదయంలో ఏదైతే ఉందో అది మన హృదయంలో కూడా ఉంది, అది వారికి తెలుస్తుంది, మనకు తెలియటం లేదు, అందుచేత మనం దానిని తెలుసుకోవాలి అనే బుద్ధి హోలీ కంపెనీ వలన మనకు కలుగుతుంది సజ్జన సాంగత్యంకోసం అవసరమైతే భూమి యొక్క అంచుల దాకా ప్రయాణం చెయ్యమని ఐన్‌స్టీన్ చెప్పాడు. సాధనచేసి సాధనచేసి ఒకోసారి అంగుళం కూడా మనం లోపలకు వెళ్లలేము. గురువు యొక్క దయ ఉంటే ఆయనే లోపలకు లాగేస్తాడు. బయటఉన్న గురువు పుష్ చేస్తాడు, లోపలఉన్న గురువు పుల్ చేస్తాడు. బయటఉన్న గురువు మనతో సన్నిహితంగా ఉంటూ, ఆయన మీద మనకు ప్రేమ కలిగేటట్లు ఆయనే చేసుకొని, మరల ఆ ప్రేమను నెపంగా పెట్టుకొని మనపట్ల దయచూపించి మనలను అనుగ్రహిస్తాడు, ఆయన అనుగ్రహం ఉంటే మన పని పూర్తి అయిపోతుంది. మనం ప్రయత్నం చేసి ఏదో కొంత దూరం వెళ్లగలము కాని తరువాత ఆయనే లాక్కొని హృదయగుహలో పడేస్తాడు, అందుచేత గురువు యొక్క ఋణం మనం తీర్చుకోలేము. గురువు చెప్పిన మాటలను శ్రవణం చేసి, మననం చేసి, వాటిని అర్థం చేసుకొని, అనుభవంలోనికి తెచ్చుకొని, గురువు ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయిని మనం అందుకోగలిగితే అప్పుడు గురువు ఋణం తీరిపోతుంది. మనకు ఎప్పుడైనా అశాంతిగా ఉంది అనుకోండి, దుఃఖం వస్తోంది అనుకోండి, అంటే అశాంతిని, దుఃఖాన్ని మనకు రుచి చూపిస్తున్నాడు. ఈ మధ్యన ఇంత అశాంతి వస్తోంది ఏమిటి? ఇంత దుఃఖం వస్తోంది ఏమిటి అని అనిపింపచేస్తాడు. నీకు వచ్చే దుఃఖం, అశాంతి నిజంకాదు అనే స్ఫురణ మనకు కలుగచేస్తాడు. మన సాధనలతోటి, ప్రయత్నాలతోటి సంబంధం లేకుండా ఎప్పుడో సడన్‌గా మనలను హృదయగుహలోనికి గెంటేస్తాడు, వాడు గురువు.

చావు అంటే అందరికీ భయం ఎందుచేతనంటే ఈ దేహమే నేను అని మనం అనుకొంటున్నాము. ఈ దేహముపోతే మనం పోతాము అనుకొంటున్నాము. ఈ దేహం పోయిన తరువాత మనం ఉండము అనుకొంటున్నాము. ఆ ఉండము అనే తలంపు వలన మనకు

భయం కలుగుతోంది. ఇది ఎలా పోతుంది అంటే కేవలం సాధనల వలన పోదు, అండర్‌స్టాండింగ్ పెంచుకోవాలి. అండర్‌స్టాండింగ్ పెరిగేకొలది ఇది చావు లేని వస్తువు, ఇది చనిపోయే వస్తువు అని నువ్వు విడదీసుకొంటావు. ఏ వస్తువుకైతే చావులేదో దానిని పొందాలి అని గోల్ నీకు తెలుస్తూ ఉంటుంది. మహాత్ములు చెప్పిన మాటలను శ్రవణం చేయటం వలన, వాటిని మననం చేయటం వలన మనం చాలాలాభం పొందుతాము. జపధ్యానముల కంటే శ్రవణ, మననములకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాలి. ఆచార్యులవారు టీచింగ్ వలననే నిన్ను లోపలకు తీసుకొనిపోయేవారు. వారి టీచింగ్ ఎలా ఉంటుంది అంటే వారు ఏ వస్తువు గురించి అయితే టీచ్ చేస్తున్నారో అది అయ్యి చెపుతున్నారు, ఆ వస్తువులో ఉండి చెబుతున్నారు అప్పుడు ఎంత క్లారిటీ వస్తుందో చూడండి. వారికి మాటలతో పని లేదు కేవలం మన పట్ల దయవలన చెపుతున్నారు. బుద్ధుడి టీచింగ్‌తో సంబంధం లేకుండా ఆయన ముఖాన్ని చూడటంవలన చాలా మందికి జ్ఞానం కలిగింది అని చెపుతారు. అంటే బుద్ధుడి మొఖం చూసేటప్పటికి ఆయన పొందిన ఆనందం, ఆయన పొందిన శాంతి మనకు కూడా స్ఫురిస్తూ ఉంటుంది, తద్వారా ఆయన పొందిన స్థితిని మనం కూడా పొందాలి అనే జిజ్ఞాస కలుగుతుంది, ఆయన దయవలన ఆ స్థితిని పొందుతాము. మనలో ఏదైనా ఉంటే అది ఇతరులకు ఇవ్వగలము కాని మనలోలేనిది ఎలా ఇవ్వగలము. ఆయనలో ఆనందం తప్పించి, శాంతి తప్పించి, సుఖం తప్పించి అక్కడ ఇంకేమీ లేదు, పైగా దానికి తరుగులేదు. వారి ప్రేమ ఎలా ఉంటుంది అంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువలాభం అన్నట్లు మీచేత ఏదోసాధన చేయించినా వస్తువును లోపల స్ఫురింపచేయటానికి ఎన్ని రకాల ప్రయత్నాలు చేస్తారో మనం ఊహించలేము, అది జ్ఞాని యొక్క వైభవం, మనలను హృదయంలో మేల్కొలపటానికి వారి దయ చాలు.

మనస్సును పోగొట్టుకోవటం అంత తేలికకాదు. మనస్సును పోగొట్టుకోవటం అంటే మనలను మనం చంపుకోవటం. మనలను మనం చంపుకోవటానికి మనం ఇష్టపడతామా? లేదు. మనోనాశనానికి మనం ఏమీ సాధన చెయ్యము, సాధన చేస్తున్నట్లుగా నటిస్తాము. మనస్సు కూడా చనిపోయినట్లుగా అది నటిస్తుంది కాని మామూలుగానే ఉంటుంది, ఎప్పుడో మరల దాని విజృంభణ వచ్చేస్తుంది. మీరు ఎక్కడికి వెళ్ళినా ఈ సృష్టిలో రాగద్వేషములు తప్పించి ఏమీ కనబడదు. రాగద్వేషములు ఉన్నంతసేపు మన మనస్సుకు వాండరింగ్ తప్పదు. మనకు రాగద్వేషాలు లేవు, మనం బుద్ధిమంతులం అని మనం అనుకొంటాము. ఓరే అబ్బాయి నువ్వు ఏమీ బుద్ధిమంతుడవు కాదు, నీ లోపల చాలా మురికి ఉంది, బురద ఉంది అని గురువు ఆ బురదను కెలుకుతాడు. నిన్ను బాహ్యంగా తలుపు సందున పెట్టి నొక్కేస్తాడు

అంటే ఒకోసారి నువ్వు అనుకొన్న పనులు అవ్వవు. ఇలా జరుగుతోంది ఏమిటి అని నీవు అనుకొంటావు. అలాగ నీ లోపల క్రైసెస్ క్రియేట్‌చేసి లోపల ఉన్న బురదను బయటకు తీసుకొని వస్తాడు. మనలో ఇంత బురద ఉందా, దీనిని తొలగించుకోవాలి అనేబుద్ధిని నీకు కలుగజేస్తాడు. రోగం ఏమిటో నిర్ధారణ అయ్యాక అప్పుడు సర్జరీ ప్రారంభమవుతుంది. గురువు హృదయంలో ఏ వస్తువు అయితే ఉందో అది మన హృదయంలో కూడా ఉంది. అయితే ఆయన హృదయంలో ఉన్నది ఆయనకు తెలుస్తోంది కాని మన హృదయంలో ఉన్నది మనకు తెలియటంలేదు. దానిని మనలో ఉన్న అలవాట్లు, బలహీనతలు అడ్డువస్తున్నాయి. గురువు ఏని చేస్తాడు అంటే ఆ బలహీనతలను కెలికి, నీలో ఈ బలహీనతలు ఉన్నాయి అని నీకు తెలియపరచి, వాటి తాలుక పెయిన్ నీకు కలుగచేసి, వాటిని తొలగించటానికి అప్పుడు సర్జరీ ప్రారంభిస్తాడు. నీకు ఉన్న అలవాట్లలో నుండి నిన్ను విడుదల చేయటానికి మేగ్జిమమ్ సహాయం అందిస్తాడు, వాడు గురువు. నువ్వు సరిగా సాధన చేయకపోతే మొట్టికాయలు మొట్టి నీచేత సాధన చేయిస్తాడు. నీకు ఎవరైతే బాగా ఇష్టంగా ఉందో వారిచేత మాటలు అనిపిస్తాడు. నీలో సహనం ఎంత ఉందో తెలుసుకోవటానికి అలా చేస్తాడు. సహనం లేకపోతే హృదయం యొక్క లోతులు పెరగవు. మన హృదయంలో సద్వస్తువు ఉంది. దానిని అనుభవైకవేద్యం చేసుకోవటానికి అంతఃకరణశుద్ధి ఉండాలి. అంతఃకరణ శుద్ధి కావాలి అంటే దేహాభిమానం తగ్గించుకోవాలి. మన సాధన ఎలా ఉండాలి అంటే మన మాటలోగాని, చేతలోగాని దేహాభిమానం పెరగకూడదు. అసలు మనం ఎందుకు మాట్లాడుతున్నాము అంటే మన అహంకారాన్ని పెంచుకోవటానికి, మన రూపబుద్ధిని, నామబుద్ధిని పెంచుకోవటానికి మాట్లాడుతున్నాము. అందుచేత మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అసలు మాట ఎందుకు వస్తోంది, మనం అవసరం ఉండి మాట్లాడుతున్నామా, అవసరం లేకుండా మాట్లాడుతున్నామా అని మనం జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. గురువు చేసే సహాయం ఏమిటి అంటే ముందు మనకు అంతఃకరణశుద్ధిని తీసుకొని వస్తాడు. మనం ఆనందం కోసం బయట వెతుకుచున్నాము. ఆనందం బయటలేదు, నీ హృదయంలోనే ఉంది అని నీకు తెలియజేసి, నీ మనస్సుకు లోచూపు కలుగజేసేవాడే గురువు. కొంతమందికి స్వార్థం ఉంటుంది, కొంతమందికి స్వార్థంతోపాటు క్రూరత్వం కూడా కలిసి ఉంటాయి. అటువంటి వారితో సహవాసం చాలా ప్రమాదం. అటువంటి వారితో సహవాసం వలన పరిణామంలో దుఃఖం వస్తుంది, శరీరం ఉండగానే నరకం ఎలా ఉంటుందో చూపిస్తారు. అందుచేత స్నేహితులను ఎన్నుకోవటంలో వివేకం అవసరం.

రమణస్వామి చెప్పే సమాధానాలు చాలా వండర్‌ఫుల్‌గా ఉంటాయి. మత్తులేకుండా సర్జరీ చేసేస్తాడు. సాధన అంటే పెయిన్‌కదా, ఆ పెయిన్‌కు గురిచేయకుండా నిన్ను చాలా దూరం తీసుకొనిపోతాడు. ఎందుచేతనంటే అది శాస్త్రజన్యజ్ఞానంకాదు, అది అనుభవైకవేద్యం, ఆయన అనుభవంలోనుండి తీసి చెప్పటమే. ఎవరైనా ప్రశ్న అడిగితే ఆలోచించి చెపుతాను అని ఎప్పడూ ఆయన అనలేదు, వెంటనే సమాధానం వచ్చేస్తుంది, అది ఆటోమేటిక్ డివైన్ యాక్షన్. నాకు జ్ఞానం ఇవ్వండి ఒక భక్తుడు భగవాన్‌ను బలవంతం చేసాడు. భగవాన్ ఏమన్నారు అంటే సరే ఇస్తాను నువ్వు తట్టుకోగలవా అంటే వెంటనే వాడు కంగారుపడ్డాడు. ఒక గ్లాసులో బిందెడు నీరు ఎలా పడుతుంది. అందుచేత గురువు స్లోగా ఆపరేట్ చేస్తాడు. నీలో బలహీనతలను ఒకోదానిని బయటకు లాగి నిన్ను శుద్ధి చేస్తాడు. వాసనాక్షయం అవ్వకపోతే మనం హృదయంలో నిలబడలేము. సమాధిస్థితిని పొందినా, నీలో వాసనలు ఉంటే ఆ వాసనలు నిన్ను అక్కడ ఉండనివ్వవు. ప్రతీ వాసన కూడా నిన్ను పీడిస్తుంది. మనలో చాలా వాసనలు ఉంటాయి. ప్రాణంపోయే ముందు ఆ వాసనలు అలా తిరుగుతూ ఉంటాయి. మనకు ఏ వాసన అయితే బాగా ఇష్టమో ఆ వాసనను పట్టుకొన్నాక ప్రాణం బయటకు పోతుంది, దానిని బట్టి మనకు పునర్జన్మ వస్తుంది. ప్రాణంపోయే ముందు మేము దేవుడిని స్మరించుకొంటాము అని మీరు అనవచ్చు కాని ఆ సమయంలో దేవుడి స్మరణ రాదు ఎందుచేతనంటే దేవుడు అంటే మనకు ఇష్టంలేదు, ఏదో కాలక్షేపంకోసం ఆయనను తలపెట్టుకొంటాము కాని అసలు మన ఇష్టాలు వేరుగా ఉన్నాయి, అవి చాలా లోతులలో ఉంటాయి. ప్రాణప్రయాణ సమయంలో అవి అన్నీ వచ్చేస్తాయి, మనస్సు సడన్‌గా వెళ్ళి బాగా ఇష్టమైన దానిని పట్టుకొంటుంది. అందుచేత వాసనాక్షయం అయ్యేవరకు ఒకవేళ ఎప్పడైనా జ్ఞానం తాలుక స్ఫురణ మీకు కలిగినా అది నిలబడదు, దానిని నమ్మటానికి వీలులేదు.

ఫళణిస్వామి రమణస్వామికి షాడోకింద ఉండేవాడు అంటే రమణస్వామి ఎక్కడ ఉంటే ఫళణిస్వామి అక్కడ ఉన్నాడని అర్థం. ఆయన గొప్ప వైరాగ్యమూర్తి. ఈశ్వరుని మాయను జయించటం చాలా కష్టం. ఫళణిస్వామి శరీరం ఇంక నాలుగు రోజులకు చనిపోతుంది అనగా ఆయన 105$^{\circ}$ జ్వరంతో ఉన్నాడు. భక్తులు ఎవరో ఆయనకు మామిడిపండు తెచ్చి ఇచ్చారు. ఆయనకు మామిడిపండు అంటే బాగా ఇష్టం. నాకు చాలా జ్వరం ఉంది ఆ మామిడిపండు తినకూడదు అని ఆయనకు తొయ్యటంలేదు. ఆ మామిడిపండును శుభ్రంగా కడుక్కొని తినటానికి రెడీ అయ్యాడు. ఆ సమయంలో రమణస్వామి అక్కడకు వచ్చాడు. అంత వైరాగ్యమూర్తి కూడా రమణస్వామిని చూడగానే తరువాత తిందామని ఆ మామిడి

పండును దాచేసుకొన్నాడు. భగవాన్ వచ్చారు, ఆయనో దొంగ. అక్కడ కూర్చొని ఫళణిస్వామి నీకు జ్వరం ఎక్కువగా ఉంది అని ఏవో మాటలు చెపుతూ ఇక్కడ మామిడిపండు వాసన వస్తోంది అన్నారు. ఇక్కడ మామిడి పండు లేదు అని ఫళణిస్వామి అబద్ధం చెప్పేసాడు. అంటే మామిడిపండు తినాలనే కోరిక లోపల ఉంది కదా అది అబద్ధం చెప్పించేసింది. మామిడిపండు లేదు అంటున్నావు మరి వాసన ఎక్కడనుండి వస్తోంది అని భగవాన్ ఏమి చేసారు అంటే మామిడి పండు ఎక్కడ దాచుకొన్నాడో అక్కడకు వెళ్ళి మామిడిపండును తీసుకొని ఫళణిస్వామి దగ్గర కూర్చుని ఆయనకు చిన్నముక్కకూడా పెట్టకుండా మొత్తం తినేసి టెంక, తొక్కలు బయటపడేసాడు. నువ్వు తినవద్దు అంటే ఆయన మానేలా లేడు అందుచేత భగవాన్ తినేసి వెళ్ళిపోయారు. వాడు గురువు. అంటే లోపల వాడిని ఏ బలహీనత బాధిస్తోందో చూసుకొంటాడు, దానిని తొలగిస్తాడు, చివరకు ఆయన చేత్తో ఫళణికి మోక్షం ఇచ్చారు. అజ్ఞానంలో నుండి బయటకు వచ్చాక వచ్చాము అనుకోవాలిగాని చివరి క్షణం వరకు మన మనస్సును నమ్మటానికి వీలులేదు, మన మనస్సే మనలను గారిడీ చేసేస్తుంది. గురువు ఏమి చేస్తాడు అంటే ఆయన టీచింగ్ ద్వారా నీ మనస్సుకు నెమ్మదిగా మెచ్యూరిటీని తీసుకొని వస్తాడు. నీ మనస్సుకు మెచ్యూరిటీ రావటంలేదు అనుకో దానికోసం కొన్ని సంఘటనలు క్రియేట్ చేస్తాడు. నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడి తాలుక ఎరుక నీకు రావటం కోసమే ఆ సంఘటనలను క్రియేట్ చేస్తాడు, అదే మన జీవితగమ్యంకదా. ఇదంతా గురువే చేస్తాడు. అందుచేత గురువు యొక్క దయ ఉంటే అన్నీ మనకు ఉన్నట్లే. ఆత్మవిద్య ఏదో మరణానంతరం ఉపయోగపడుతుంది అని చాలామంది అనుకొంటారు, అలా కాదు. ఈ శరీరం భూమి మీద తిరుగాడుతుండగా ప్రారబ్దాన్నిబట్టి మంచి, చెడు ఎదురవుతూ ఉంటాయి. నీకు ఎంత చెడ్డ ఎదురైనా, ప్రపంచంలో ఎవరికిలేని దుఃఖం అంతా నీకు వచ్చేసినా, ఆత్మవిద్య కనుక ఉంటే అన్ని కష్టాల మధ్యన నీవు ప్రశాంతంగా ఉండగలవు, అది ఆత్మవిద్య నీకు చేసే లాభం. అంతేగాని ఆత్మవిద్య ఏదో పరలోకంలో ఉపయోగపడుతుంది, ఈలోకంలో ఉపయోగపడదు అనుకొంటే మీకు సరైన అవగాహన లేదని అర్థం. మీరు బ్యాంకులో డబ్బులేసుకొంటారు, రోజూ తియ్యరు, మీకు ఏదైనా ఇబ్బందులు వచ్చినప్పుడు బ్యాంక్‌లో ఉన్న డబ్బు ఉపయోగపడుతుంది. అలాగే ఆత్మవిద్య మీరు నేర్చుకొని ఉంటే భవిష్యత్‌లో మీ ప్రారబ్దం అనేక దెబ్బలు కొట్టవచ్చు, మీరు ఊహించనికష్టాలు రావచ్చు. ఎన్ని కష్టాలు, ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆత్మవిద్య నిన్ను కాసేస్తుంది. అది ఆత్మవిద్య యొక్క వైభవం. ఈ పని చేయండి, ఈ పని చేయవద్దు అని గీతలో పరమాత్మ చెప్పాడు. పరమాత్మ చెయ్యమని చెప్పిన పనిని చెయ్యాలి,

ఆయన వద్దని చెప్పినది మానివేయాలి. అంతేగాని ఇది ఎందుకు చెయ్యమన్నాడు, అది ఎందుకు వద్దన్నాడు అనే వాదనలు వద్దు. ఇటువంటి ప్రశ్నలు వస్తూ ఉంటే మీకు శరణాగతి లేదని అర్థం. ముందు మనం అంతఃకరణశుద్ధిని సంపాదించాలి, గురువుపట్ల సజీవమైన విశ్వాసం కలిగి ఉండాలి. గురువు మనలో అంతర్యామిగా ఉన్నాడు కదా ఆయన మనకు వచ్చే ప్రతీ తలంపును చూస్తాడు, మనం దానికి సమాధానం చెప్పాలి. అందుచేత మాటలవిషయంలో, పనులవిషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు. శ్రద్ధ వల్లే నీకు జ్ఞానం కలుగుతుంది. శ్రద్ధ అనే రెండు అక్షరాలను నువ్వు మరచిపోవద్దు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-10-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సాధన లేకుండా ఏదీ సాధ్యం కాదు. మన ఋషులు ఎంతో తపస్సు చేసారు అని, ప్రాణాయామం చేసేవారని, ఎంతో ఆహారనియమంగా ఉండేవారని పురాణాలలో చదువుతున్నాము. అన్ని నియమాలు పెట్టుకొని వారు ఎందుకు ఉన్నారంటే ఇంద్రియనిగ్రహం కోసం, మనోనిగ్రహం కోసం ఇవి అన్నీ చేసారు. మేము మంచిపనులు చేస్తున్నాము మాకు మోక్షం వచ్చేస్తుంది అని ఎవరూ అనుకోవద్దు. మీరు మంచిపనులు చేస్తే మీకు పుణ్యం వస్తుంది, పుణ్యం సుఖరూపంలో ఖర్చు అయిపోతుంది కాని మీకు ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం రాదు. మనోనిగ్రహం లేకుండా మనస్సుకు లోచూపురాదు. మేము ఆ యాత్రలకు వెళ్ళాము, ఈ యాత్రలకు వెళ్ళాము అని చెపుతారు, వెళితే వెళ్ళవచ్చుకాని నీ మనస్సు, ఇంద్రియాలు ఎంతవరకు స్వాధీనంలో ఉన్నాయి, నువ్వు ఆధ్యాత్మికంగా పురోగతి పొందటానికి నీ ఇంద్రియాలు, మనస్సు ఎంతవరకు సహకరిస్తున్నాయి అనేది చూసుకొంటూ సాధన చెయ్యాలి అని వసిష్ఠుడు చెప్పాడు. అంటే మన మనస్సును జాగ్రత్తగా ఉపయోగించుకొని మనస్సులేనిస్థితికి రావాలి. అదీ సాధన అంటే. మీరందరూ కాలాన్ని పాడుచేసుకొంటున్నారు. ఇంటి దగ్గర మీరు పెద్దగా సాధన చేస్తున్నట్లు కనబడటంలేదు. డబ్బు పోగొట్టుకొంటే మరల సంపాదించుకోవచ్చుగాని కాలం పోగొట్టుకొంటే తిరిగిరాదు. అది జ్ఞాపకం పెట్టుకోండి.

మీరు మంచిపనులు చేసుకోండి చనిపోయాక వైకుంఠానికి వెళతారు అని విష్ణు భక్తులు చెపుతారు, మీరు మంచిపనులు చేసుకోండి చనిపోయాక కైలాసానికి వెళతారు అని శివ భక్తులు చెపుతారు, ఇలా రకరకాలుగా చెపుతారు. మీరు చేసుకొన్న పుణ్యాన్ని బట్టి ఆలోకాలకు వెళ్ళవచ్చు, అక్కడ కొంతకాలం ఆనందంగా ఉండవచ్చు. ఇప్పుడు మీరు ఏదో చేయండి, తరువాత ఎక్కడికో వెళతారు అని చెప్పే సబ్జక్టు కాదు మనది, ఇది ప్యూర్ సైన్స్. మీరు జీవించి

ఉండగానే, ఈ శరీరంలో ఉండగానే మీరు హృదయంలోనికి ప్రయాణం చెయ్యాలి. ప్రతీవాడు నేను నేను అంటున్నాడు కదా. ఆ నేను అనే తలంపు నీకు లోపల నుండే వస్తోంది, అది ఎక్కడ నుంచి ఉదయించి వస్తోందో అదే హృదయం. మనం ఆహార నియమంగా ఉంటూ, ప్రాణాయామం చేస్తూ, సజ్జనసాంగత్యం చేస్తూ ఇలా బాహ్యంగా చేసే సాధనలు అన్నీ చేస్తూ నేను అనే తలంపు ఎంతలోతులలోనుండి వస్తోందో అక్కడకు మనం ప్రయాణం చేయాలి. ఈ లోపుగా మీకు ఏవో కుటుంబసమస్యలు వస్తూ ఉంటాయి, కష్టాలు, నష్టాలు వస్తూ ఉంటాయి. మీరు ఇక్కడే ఆగిపోతారు కాని ఇంక మీ మనస్సులోపలకు వెళ్ళరు. మనస్సు లోపలకు ప్రయాణం చేయాలంటే దానికి పవిత్రత ఉండాలి, ఏకాగ్రత ఉండాలి, ఆచార్యుడి అనుగ్రహం ఉండాలి. మనం కోరికలతోటి గుడులుచుట్టూ తిరుగుతున్నాము కాని కోరిక లేని భక్తి మనకు లేదు. కోరికలేకుండా పనిచెయ్యము, కోరిక లేకుండా పూజ చెయ్యము మనకు వ్యాపారలక్షణాలు ఉన్నాయి కాని భక్తుడి లక్షణాలు మనకు లేవు.

భాగవతంలో చాలా కధలు ఉన్నాయి కాని సాధకుడికి బాగా ఉపయోగపడేది గజేంద్రమోక్షం. ఏనుగు కొలనులో దిగుతుంది అక్కడ దానిని ముసలి పట్టుకొంటుంది. ఒడ్డుకు రావటానికి ఏనుగు చాలా ప్రయత్నం చేస్తుంది. మిగతా ఏనుగులు సహాయం చేయటానికి చూసినా అది బయటకు రాలేకపోయింది. దానిని విడిచిపెట్టి మిగతా ఏనుగులు వెళ్ళిపోతాయి. మన బతుకు కూడా అంతే. ఇవాళ సుఖంగా ఉన్నారుకాబట్టి నీ చుట్టూ జనం తిరుగుతున్నారు, మీకు ఏవైనా కష్టాలు, బాధలు వచ్చాయి అనుకోండి మీ బంధువుగాని, స్నేహితుడుగాని ఒక్కడు కూడా కనబడడు. ఆచార్యులవారు ఏమన్నారు అంటే గజేంద్రుడు పైకిరాకుండా ఆ మొసలి దాని కాలును పట్టుకొని విడిచిపెట్టటం లేదు అలాగే నీ మనస్సులోపలకు వెళ్ళకుండా కామం నిన్ను పట్టుకొని విడిచిపెట్టటం లేదు. ఆ ముసలే మెరుగు ఈ కామం అంతకంటే బలంగా ఉంటుంది. నేను చెయ్యవలసిన ప్రయత్నం అంతా చేసాను ఇంక ఆ ముసలితో పోరాడలేకపోతున్నాను, పోరాడేశక్తి పోయింది, నన్ను రక్షించమని గజేంద్రుడు మహావిష్ణువును ప్రార్థిస్తాడు. అప్పడు విష్ణువు వేగంగా వచ్చి మొసలిని సంహరించి ఏనుగును రక్షించాడు. అలాగే ఈ కామాన్ని జయించి అందులోనుండి బయటపడాలంటే మనం భగవంతుడిని ప్రార్థించాలి, భగవంతుడి దయ లేకుండా మనం అందులో నుండి విడుదల పొందలేము.

నువ్వు ఏ పని చేసినా నాకోసం చెయ్యి అని పరమాత్మ గీతలో చెప్పాడు. సర్వసాధారణంగా మంచి పనులు చేసేవారు కూడా గౌరవంకోసం చేస్తారు. ఈ జబ్బు అందరికీ ఉంటుంది. అంటే నువ్వు రూపబుద్ధి, నామబుద్ధి పెంచుకోవటానికి మంచిపనులు చేస్తావు. భగవాన్

ఏమన్నారు అంటే నీ రూపబుద్ధిని, నామబుద్ధిని పచ్చడికింద చేసెయ్యి అదే సాధన అన్నారు. రూపబుద్ధి, నామబుద్ధి ఉన్నంతకాలం మీరు కోటిజన్మలు ఎత్తినా, ఎన్ని సాధనలు చేసినా హృదయం వైపుకు ఒక్క అంగుళంకూడా వెళ్ళలేరు. నువ్వు ఏపనిచేస్తున్నా అక్కడ అంతర్యామిగా ఉన్న నన్ను దృష్టిలో పెట్టుకొని పనిచెయ్యి అంతేగాని ఆ రూపంగాని, నామంగాని నీకు అనవసరం. నామరూపములను దృష్టిలో పెట్టుకొని పనిచేస్తే నువ్వు నన్ను పొందలేవు. నీ మనస్సును సంతృప్తి పరచుకోవటంకోసం, నీ అహంకారాన్ని అలంకరించుకోవటంకోసం ఏ పని చెయ్యకు. మీరు భగవంతుడిని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తే చెట్టు మొదలులో నీరుపోసినట్లు అవుతుంది. చెట్టు మొదలులో నీరుపోస్తే అది చెట్టు అంతా వ్యాపిస్తుంది అంటే కొమ్మలకు, ఆకులకు అన్నింటికి అందుతుంది. అలాగే మీరు ఈశ్వరుని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తే అది మీకూ మంచిదే, లోకానికి మంచిదే. ఈశ్వరుని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తే మనస్సు నశిస్తుంది. గొప్పలు ఆశించి పనిచేస్తే మనస్సు పెరిగిపోతుంది. ఇక్కడ మేము శాస్త్రం గురించి చెపుతున్నాము అనుకోండి. భగవంతుడు చెప్పిన మాటలకు న్యాయం చెయ్యాలి. ఉన్నది ఉన్నట్లు చెప్పకుండా ఏవోతింగరమాటలు చెపుతున్నాము అనుకోండి ఇటువంటివాడి చేతిలో పడ్డాముఏమిటి అని భగవంతుడు అనుకొంటాడు, అందుచేత బహుజాగ్రత్తగా ఉండాలి. నన్ను దృష్టిలో పెట్టుకొని పనిచెయ్యండి, నన్నే గతిగా పెట్టుకోండి అని పరమాత్మ చెపుతున్నాడు. మీకు ఎంతోకొంతభక్తి ఉంది కాని గతిమటుకు ఈశ్వరుడు కాదు. మీ కుటుంబసభ్యులో, ఏవో గొడవలో ఉంటాయి, అవే మీ గమ్యం. ఆ గమ్యాన్ని పొందటానికి దేవుడిని ఉపయోగించుకొంటారు. మీరు అలా చేస్తూ ఉంటే ఆయనకు అభ్యంతరం లేదు కాని మీరు భగవంతుడిని పొందలేరు. నన్నే గమ్యంగా పెట్టుకొని ఎవరైతే జీవిస్తున్నారో వారు నా స్వరూపాన్ని పొందుతారు అని పరమాత్మ చెపుతున్నాడు. ఇంట్లో గొడవలు నెరవేర్చమని దేవుడిని ప్రేమిస్తూ ఉంటాము కాని దేవుడిని పొందటం కోసం దేవుడిని ప్రేమించము. నా పని చేయటమే కాదు నన్ను గమ్యంగా పెట్టుకొని పనిచేయండి అంటున్నాడు. మీరు కూలి పనికి వెళ్ళారు అనుకోండి, అక్కడ యజమాని కోసం పని చెయ్యము, వాడు ఇచ్చే వందరూపాయల కూలీకోసం మనం పనిచేస్తాము. అక్కడ యజమాని గొడవ మనకు అక్కరలేదు, కనీసం వాడిని చూడాలి అని కూడా మనం అనుకోము. అలాగ నా పనులు చెయ్యవద్దు, మీరు చేసే పనులు కూలిపనులకింద చేయకండి. ఇక్కడ నన్ను గమ్యంగా పెట్టుకొని పనిచెయ్యండి, మీరు పొందవలసినవాడిని కూడా నేనే అంటున్నాడు పరమాత్మ, నన్ను స్మరించుకోండి, భగవంతుడికి సంబంధించిన విషయాలమీదే మీ మనస్సు తిరుగుతూ

ఉండాలి. మీరు శవపూజ చెయ్యవద్దు, శివపూజ చెయ్యండి అంటున్నాడు. మీరు ఎవరికైనా బట్టలు ఇచ్చారు అనుకోండి ఆ శవానికి కాదు, ఆ శవంలో అంతర్యామిగా ఉన్న నన్ను చూస్తూ బట్టలు ఇవ్వండి, మీ పనులు అయ్యాక మిగతా టైములో నన్ను స్మరించుకోండి, నా కథలు చెప్పకోండి. నన్ను పొందాలి అనే దృష్టితో ఇవి అన్నీ చెయ్యండి కాని ఏదో పుణ్యం సంపాదించాలి అని అటువంటి గొడవలలోనికి వెళ్ళవద్దు. పుణ్యం బంగారపు సంకెళ్ళు, పాపం ఇనుప సంకెళ్ళు, రెండూ సంకెళ్ళే. మీరు సత్సంగం చేసుకొంటున్నారు అనుకోండి అక్కడ లోకం గొడవలు వస్తే వెంటనే లెగిసి వెళ్ళిపోవాలి. సత్సంగంలో సద్వస్తువు గురించి, ఈశ్వరుడి గురించి తప్పించి ఇంక ఏ ప్రస్తావన రాకూడదు. ఇతర విషయాలు మాట్లాడేవారిని వెళ్ళిపొమ్మని చెప్పినా తప్పలేదు. అంటే వింటే భగవంతుడి గురించివినాలి, చూస్తే భగవంతుడినే చూడాలి, భగవంతుడి విషయాలు స్మరించుకోవాలి అలా మనస్సును, ఇంద్రియాలను భగవంతుడిచుట్టూ తిప్పతూ ఉంటే ఇంద్రియనిగ్రహం వస్తుంది, మనోనిగ్రహం వస్తుంది, అంతర్యామిగా ఉన్న ఆయనను పొందుతాము. సంఘదోషం ఉండకూడదు. కుటుంబసభ్యులమీద ఎక్కువ మోహం పెట్టుకోవద్దు. మీ డ్యూటీ ఏదో మీరు చెయ్యాలికాని అస్తమాను వారిని నెత్తిమీద పెట్టుకొని మోయవద్దు. అస్తమాను వారిని నెత్తిమీద పెట్టుకొని మోయటం వలన వారు బాగుపడతారు అనుకోవద్దు, చెడిపోతారు. మీ డ్యూటీ చెయ్యండి, వారి శరీరాలను అంటే మీరు కన్నారు కాని వారి ప్రారబ్ధాలు మీరు కనలేదుకదా, ప్రారబ్ధాన్నిబట్టి వారి జీవితం నడుస్తుంది. సమాజంలో కూడా మనం అనేకమందికి సహకరిస్తాము అలాగే మీ కుటుంబ సభ్యులకు సహకరించవచ్చు అంతవరకే కాని 24 గంటలు నీ మనస్సును వారిచుట్టూ తిప్పవద్దు. సంఘదోషం ఉంటే నీ మనస్సుకు లోచూపు రాదు. నువ్వు సోమరితనంగా ఉండి నాకు మోక్షం కావాలి, నాకు మోక్షం కావాలి అంటే భగవంతుడు నీ జోలికి రాడు. మోక్షం పొందటానికి నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే నీ కూడావచ్చి నీకు సహకారం అందించి నిన్ను మోక్షంలోనికి గెంటేస్తాడు. వాడు భగవంతుడు. ఈ మధ్యన ఓ మహాత్ముడు ఏమని చెప్పారు అంటే తల్లితండ్రులకంటే ఆచార్యుడే ముఖ్యం అని చెప్పారు. తల్లితండ్రులు నీకు అన్నంపెడతారు, బట్టలు ఇస్తారు, డబ్బు ఇస్తారు, వారు నీ బాహ్యజీవితాన్ని చూస్తారుకాని లోపల నువ్వు ఎలా ఉన్నావో వారికి అక్కరలేదు. నీలోపల జీవితాన్ని చూసి సరిచేసేవాడే ఆచార్యుడు. నీలో బలహీనతలు ఉంటే వాటిని తొలగించి, నిన్ను పవిత్రుడిని చేసి, నిన్ను హృదయాభిముఖంగా తీసుకొనిపోయేవాడే ఆచార్యుడు. ప్రారబ్ధాన్నిబట్టి జీవితంలో ఒకోసారి మంచి, ఒకోసారి చెడు ఎదురవుతుంది. వాటిని తట్టుకొని ప్రశాంతంగా ఉండగలగాలి. ఎన్ని కష్టాలు వచ్చినా ఇవి ప్రారబ్ధాన్ని బట్టి వస్తున్నాయి

అనుకోవాలి కాని ఇంక రాకూడదు, రాకూడదు అని అనుకోవద్దు. మనం జున్ను ఎంత ఇష్టంగా తింటామో అంత ఇష్టంగా ప్రారబ్ధాన్ని అనుభవిస్తే ఆ ప్రారబ్ధం ఇంక వచ్చే జన్మలో రాదు. నువ్వు పనిచేయాలి కాని ఆసక్తి పెట్టుకోవద్దు. నీ మనస్సులో భగవంతుడికి తప్పించి ఇంక ఎవరికి స్థానం ఉండకూడదు. భగవాన్ ఏమంటున్నారు అంటే మన కుటుంబ సభ్యుల గురించి వారు మన ఇంటిలో పుట్టకముందు ఎక్కడ ఉన్నారు, వారు ఎక్కడనుండి ఇక్కడకు వచ్చారు అనే ఆలోచన మనకు ఉండదు. చనిపోయాక ఎక్కడికి వెళ్ళిపోయారు, ఎక్కడికి వెళ్ళిపోయారు అని మొదలుపెడతాము, తద్దినాలు మాసికాలు అని ఏవో గొడవలు చేస్తాము. వారు పుట్టకముందు ఎక్కడో ఉండి మీ ఇంటికి వచ్చారు కదా. పుట్టకముందు వారి గొడవ నీకు లేనప్పడు, చనిపోయాక వారి గొడవ నీకు ఎందుకు వస్తోంది, అదే మాయ. పుట్టక ముందు వారికి దేహం లేదు, తరువాత వారికి దేహం వచ్చింది. చనిపోయిన తరువాత ఆ దేహం మీకు గుర్తుకు వస్తోంది కాబట్టి వారు ఎక్కడికి వెళ్ళారు అనే గొడవ వస్తోంది. అదికూడా దేహ వాసన. మీకు దేహవాసన ఉంది కాబట్టి, వారు కూడా దేహం అనుకొంటున్నారు కాబట్టి అక్కడ నుండి అశాంతి అంతా వస్తోంది. ఏ జీవుడిపట్ల విరోధం వద్దు. ఎవరైనా మిమ్మల్ని శత్రువులు అనుకొన్నా, వారు నాకు శత్రువులు అని మీరు ఎవరినీ అనవద్దు. మనం ఎక్కడ వైరం పెట్టుకొన్నా నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మీకు ఎవడైనా అపకారం చేసాడు అనుకోండి ఆ గొడవే అస్తమాను తలపెట్టుకొంటూ ఉంటే తిరిగివాడికి అపకారం చెయ్యాలి అని ఇటువంటి ఆలోచనలు వచ్చేస్తాయి, దాని వలన సంసారం పెరిగిపోతుంది. ఈశ్వరుడి దయ లేకుండా ఏ మనిషి సంసారంలో నుండి బయటకు రాలేడు. మరణానంతరం నీకూడా ఏదీ రాదు, నీ మనస్సు మాత్రమే మరణానంతర జీవితంలో నీకూడా వస్తుంది, దానిని బాగుచేసుకోవటానికి ఏమీ ప్రయత్నం చెయ్యవేమిటి పిచ్చివాడా? ఎంత వెర్రితనం నీది అంటున్నాడు.

ఆచార్యులవారు కామం గురించి ఏమని చెప్పారు అంటే కామం మనకు శత్రువుకింద రాదు, మిత్రుడిగా వస్తుంది. మనకు విరోధిగా ఉండి అపకారం చేయటం కష్టం. ఎందుచేతనంటే వాడు విరోధి అని మనకు తెలుస్తూ ఉంటుంది కదా వాడి వలలో పడకుండా మనం జాగ్రత్తగా ఉంటాము. కొంతమంది ఏమి చేస్తారు అంటే మనకు స్నేహంగా ఉంటూ అపకారం చేస్తారు. కామం ఏమి చేస్తుంది అంటే మనతో స్నేహంగా ఉంటూ నాకు ఏమీ పని లేదు, నీ సుఖం నాకు కావాలి అని చెపుతూ టైము వచ్చినప్పడు కాటేస్తుంది. ఇది లోపల శత్రువు. శత్రువు శత్రువుగా కనిపిస్తే ప్రమాదం లేదు. ఇది మిత్రుడుగా కనిపిస్తున్న శత్రువు. తాడు పాముకింద కనిపిస్తే ప్రమాదం లేదు. పాము తాడు కింద కనిపిస్తోంది అనుకోండి దాని మీద చెయ్యివేస్తే కరిచేస్తుంది,

మనం చనిపోతాము. పాముకరిస్తే ఆ శరీరం చనిపోతుంది కాని కామం కొన్నివేల జన్మలు తీసుకొని వచ్చేలాగ కరిచేస్తుంది. మనకు స్నేహితుడిగా ఉండి ఎంత అపకారం చెయ్యాలో అంత అపకారం చేసేది కామం ఒక్కటే. ఈ భూమిమీద నీకు ఎవరైనా శత్రువులు అంటూ ఉంటే కామం తప్పించి ఇంకో శత్రువు లేడు. బుడబుక్కల మాటల వలన ప్రయోజనం లేదు. నీ జీవితంలో క్వాలిటీ ఉండాలి. మనం మిఠాయి తింటున్నాము అనుకోండి. అది బాగుంటే తింటాము కాని బాగాలేకపోతే ఇంట్లో చేసినా తినము. అంటే రుచిగా ఉండాలి, క్వాలిటీ ఉండాలి అప్పుడు కాని మనం తినము. అలాగే నీ జీవితంలో క్వాలిటీలేకుండా నిన్ను భగవంతుడు తన ఒడిలోనికి ఎలా తీసుకొంటాడు. ఒకో ఇంద్రియానికి ఒకో ఇష్టం ఉంటుంది. ఆ అవయవాలకు ఆ వస్తువులమీద ఎంత ఇష్టం ఉందో అంతకు రెట్టింపు ఇష్టం మీకు పరమేశ్వరుడిమీద వస్తేనే ఆయన మీకు లభ్యమవుతాడు. మాకు భగవంతుడు అంటే ఇష్టం అని ఏదో నోటితో చెపితే సరిపోదు, అది హృదయంలో నుండి రావాలి. మీ ఇంద్రియాలకు విషయాలంటే ఎంత సహజంగా ఇష్టం ఉందో అంత సహజంగా మీ మనస్సుకు భగవంతుడి మీద ఇష్టం వస్తే ఆయన మీకు లభ్యమవుతాడు. నీ మనస్సును దోషరహితం చేయాలి, నీ మనస్సులో ఎక్కడా కల్మషం కనబడకూడదు, ఒకవేళ కల్మషం ఉంటే తొలగించుకోవాలి కాని అది ఎప్పుడు వచ్చింది, ఎలా వచ్చింది అని దానిని రాపాడించుకోవటం అనవసరం. నీ లోపల కల్మషం పోలేకపోతే, నీవు దోషరహితుడవు అయితే అప్పుడు నీవు బ్రాహ్మీస్థితినిపొందుతావు అని పరమాత్మ చెప్పాడు. మీకు కష్టాలు వచ్చినా, సుఖాలు వచ్చినా లోపల ఉన్న వస్తువు తాలుక ఎఱుక విడిచిపెట్టకూడదు. వంతెనకిందకు నీళ్లు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి అలాగే ప్రారబ్ధాన్నిబట్టి మీకు కష్టాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. సుఖాలు వస్తూ ఉంటాయి, పోతూఉంటాయి. రమణభగవాన్ ఆయన జీవితంలో ఏ సంఘటనకు ఆశ్చర్యపడలేదు. అది అలా జరిగవలసి ఉంది జరిగింది అంతే అనేవారు. అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది అని నీకు అర్థమైతే ఎవరిమీద విరోధం పెట్టుకొంటావు. మీకు ఎవరైనా అపకారం చేసినా అది ఈశ్వరుడికి తెలియకుండా జరగటంలేదు. మీ ప్రారబ్ధంలో వాడిద్వారా అపకారం జరగవలసి ఉంది, జరుగుతోంది. ఈరోజు మీకు బాగా ఇష్టమైన వారు రేపు మిమ్మల్ని తిట్టవచ్చు, దానికి మీరు ఆశ్చర్యపోకూడదు, అది ఈశ్వర నిర్ణయం. ఏ జీవుడూ స్వతంత్రుడుకాదు, భగవంతుడు ఈ బొమ్మలను ఆడిస్తున్నాడు, ఆయన ఆడమన్నట్లు ఆడవలసిందే. ఈ వాక్యాన్ని మనం నమ్మము దానికి మన మనస్సులో ఉన్న కల్మషం కారణం. ఇంట్లో వ్యక్తులు చనిపోతే ఏడుస్తున్నారుకాని మీలో ఉన్న కల్మషం పోవటంలేదని ఎవరూ ఏడవరేమిటి? ఆ కల్మషంపోతే ఏ స్థితిని పొందుతారో

మీకు తెలియటం లేదు. దేహబుద్ధి పోవటం చాలాకష్టం. దేహం నడిచివెళుతూ ఉంటే మన దేహం కూడా నీడ వస్తుంది. ఆ నీడ మీద మనకు నేను అనే తలంపు లేదు. కాని దేహం మీద నేను అనే తలంపు ఉంది. ఆ నీడ మీద నీకు నేను అనే తలంపు ఎలా లేదో, నీ దేహం మీద కూడా నీకు నేను అనే తలంపు శేషం లేకుండా నిశ్శేషంగా పోతే అప్పడు నువ్వు నిర్వాణసుఖాన్ని పొందుతావు, నీ దేహం ఎంత నిజమో, ఈలోకం ఎంతనిజమో, నీ గొప్పలు కూడా అంతే నిజం. వాటిని మూటకట్టి ఏ చెరువులోనో పడెయ్యి. నాకోసం జీవించు, నన్నే కేంద్రంగా పెట్టుకొని పనిచెయ్యి అప్పడు నీకు దైవీసంపద కలుగుతుంది అని పరమాత్మ చెపుతున్నాడు. మనం చెరువు దగ్గర కూర్చున్నాము అనుకోండి, నీరు ప్రశాంతంగా ఉంటే మన నీడ అందులో కనబడుతుంది. పిల్లలు ఎవరైనా అందులో బెడ్డలు వేస్తే నీటిలో ఉన్న ప్రశాంతత పోతుంది అప్పడు మీ నీడ కనబడదు. నీటిలో బెడ్డలు వేస్తే ఆ నీరు చెదిరిపోయి మీ నీడ ఎలా కనబడదో అలాగే మీ కుటుంబంలో వచ్చే గొడవలు అన్నీ మనస్సులో పెట్టుకొంటే మనస్సు కల్మషం అయిపోయి లోపల ఉన్న సద్వస్తువు కనిపించకుండా పోతుంది. సుఖాలలో రకరకాల సుఖాలు ఉన్నాయి. ఇప్పడు లడ్డూ తింటున్నారు అనుకోండి. తిన్నంతసేపు బాగుంది, సుఖంగా ఉంది అనిపిస్తుంది కాని అది దుఃఖమే సుఖరూపంలో ఉంది అంటున్నారు. ఇంద్రియ గతమైన సుఖాలు అవి ఉత్తమ సుఖాలు కాదు. ఏ సుఖం పొందిన తరువాత దానికిమించిన సుఖంకాని, దానితో సమానమైన సుఖంగాని లేదని తెలుస్తుందో అటువంటి సుఖంలోనికి మేలుకో అంటున్నాడు పరమాత్మ. ప్రకృతిలో ఇంద్రియాలద్వారా మీరు పొందే సుఖాలు అన్నీ పరిణామంలో దుఃఖంగా మారిపోతాయి. ఒక్క ఆత్మసుఖం తప్పించి ప్రతీదీ నీకు దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. నీకు అత్యంత స్నేహితుడి రూపంలో ఉన్న శత్రువు కామం, అది నీవు గ్రహించటంలేదు. బయట శత్రువులను చంపటం తేలిక, లోపల ఉన్న శత్రువులను చంపటం కష్టం. నీ లోపల ఉన్న శత్రువు కామం. ఆచార్యుడు చేసేపని ఏమిటి అంటే ఆయన నీ లోపల ఉన్న శత్రువులను చంపుతాడు. మనం ఇప్పడు ఇక్కడ కలుసుకొన్నాము. మీకు చావువస్తుంది, నాకు చావువస్తుంది. ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి చనిపోయిన తరువాత ఎక్కడికో వెళ్ళిపోతాము, ఉండమేమో అని కంగారుపడవద్దు. దేహం చనిపోయిన తరువాత కూడా మనం ఉంటాము కాని ఈ దేహం కనబడదు అంతే. మన సుఖానికి దేహం అక్కరలేదు. ఈ దేహంతోటి, మనస్సుతోటి సంబంధం లేకుండా ఉత్తమ సుఖం మీరు పొందుతారు. మీరు కరెక్టుగా సాధన చేస్తే ఈ దేహంలో ఉండగానే ఉత్తమ సుఖాన్ని పొందవచ్చు, అలా పొందితే శరీరం పోయాక కూడా అది కంటిన్యూ అయిపోతుంది. అటువంటి స్థితిని మీరు పొందితే మిమ్మల్ని చూసి అనేకమంది తరిస్తారు.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | | |
|---|---|---|
| నవంబర్ | 08 | పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపం |
| నవంబర్ | 15 | తణుకు, క్షత్రియ కళ్యాణ మండపం |
| నవంబర్ | 24 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |
| నవంబర్ | 28 | కాపవరం, గీతామందిరం |
| డిసెంబర్ | 1 నుండి | అరుణాచలం క్యాంపు (దీపోత్సవం) |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# వచ్చిన పని మరచిపోవద్దు

"మనము ఈ భూమి మీదకు వచ్చిన పనిని మరచిపోకూడదు" అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. వాస్తవంగా మనమెవరమో అనుభవైకవేద్యం చేసుకొనే మహత్కార్యం నిమిత్తం పరమాత్మ ఈ మానవ జన్మ ప్రసాదించి భూమి మీదకు పంపారు. కాబట్టి వాస్తవంగా నేనెవరో? తెలియబడాలనే ఉన్నత ఆశయానికి తగినట్లుగా శ్రద్ధ, పట్టుదల కలిగి యుండి కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ, దాని కొరకే జీవించాలి. యాంత్రికంగా దేహాత్మబుద్ధితో బ్రతుకుతూ ఉంటే రోజులు, వారాలు, నెలలు వృధాగా దొర్లిపోతూ ఉంటాయి. కాని మహాత్ములు కాలాన్ని తమనకు అనుకూలంగా మలచుకొని ప్రతిక్షణాన్ని సద్వినియోగం చేసుకొంటూ, జీవితాన్ని జీవిస్తారు. కాలాన్ని మన సాధనా లక్ష్యమైన "మనోనాశనానికై" సద్వినియోగం చేసుకోవడం గొప్ప కళ. మితాహారం, మితభాషణ, మితనిద్రా నియమాలను పాటిస్తూ, మనస్సుకు శిక్షణ నిస్తూ, త్రికరణ శుద్ధిని సాధించాలి. మన భవిష్యత్తుకు మనమే కర్తలం కాబట్టి ఎరుకతో జీవించాలి, అట్లు కానిచో మన కళ్ళముందే కాలం వృధాగా కరిగిపోతుంది. భగవంతుడు కాల రూపంలో మనకిచ్చిన మానవ జీవితాన్ని వృధా చేసిన వారమవుతాము. పరమాత్మచే బహుమతిగా ప్రసాదింపబడిన మానవ జన్మను సద్వినియోగం చేసుకొని, దేహం జీవించి యుండగా, ఇప్పుడే ఇక్కడే స్వరూప ఎరుకలోకి మేల్కోవాలి! భగవాన్ శ్రీరమణ మహర్షి "నీవెవరివో తెలిసికో"! అని బోధించారు, ఆ తెలిసికొనుటకే పరిపూర్ణంగా ఈ జీవిత కాలాన్ని ఉపయోగించుకొని వచ్చిన పనిని పూర్తిచేసుకోవాలి.

**చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం**

# ద్రవించి చేసే పనే - దయ